



కృత్తివెన్ను మండలం గాంధీనగరం వద్ద 216 జాతీయ రహదారిపై వరి పంట నూర్పిడి

మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో సోమవారం ఉదయం నుంచే వర్షం ప్రారంభమైంది. మంగళవారం రాత్రికి తీరం దాటుతుందని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాను గమనం ఆధారంగా వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో పర్యటించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. జిల్లాలోని పునరావాస కేంద్రాలను జిల్లా ప్రత్యేక అధికారి అమ్రపాలి పరిశీలించారు. వసతులపై బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



గిలకలదిండి పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి అమ్రపాలి, చిత్రంలో జేసీ నవీన్

జిల్లా అంతటా వర్షం

దూసుకొస్తున్న మొంథా తుఫాను

ఉదయం నుంచి కురుస్తున్న వాన



కోడూరు మండలం హంసలదీవి వద్ద అల్లకల్లోలంగా సముద్రం



నందివాడలో బుడమేరు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

- నేటి రాత్రికి తీరం దాటుతుందని అంచనా
- తుఫాను గమనం ఆధారంగా తీవ్రత పెరిగే అవకాశం
- జిల్లాలో 180 పునరావాస కేంద్రాలు
- కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం మండలాల్లో 400 మంది వరకు తరలింపు
- క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్, జేసీ, ఎస్పీ
- పునరావాస కేంద్రాలను పరిశీలించిన జిల్లా ప్రత్యేక అధికారి అమ్రపాలి

కరకట్టలపై నిఘా

సముద్రతీరం వెంబడి కరకట్టలు, కాల్వగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. భారీ వర్షాల కారణంగా కాజ్‌వేల వద్ద నీటి ప్రవాహం అధికమైతే అక్కడ రాకపోకలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో సమన్వయం చేసుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస శిబిరాలకు మంగళవారం ఉదయంలోగా తరలించడానికి ప్రణాళికను రూపొందించామని వివరించారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల సోమవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఏ క్షణంలో వర్షం పెరుగుతుందోననే భయం జిల్లా ప్రజలను వెంటాడుతోంది. తుఫాన్ ప్రభావంతో మంగినపూడి బీచ్, హంసలదీవి బీచ్‌ల వద్ద సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఈ బీచ్‌లలోకి ఎవ్వరినీ పోలీసులు అనుమతించడం లేదు. మచిలీపట్నం, కోడూరు మెరైన్ పోలీసులతో బీచ్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం తదితర మండలాల్లో 400 మందిని పునరావాస మిగతా 6లో..

ప్రత్యేక అధికారి పరిశీలన

మొంథా తుఫాను నేపథ్యంలో సహాయ చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి అమ్రపాలి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. గిలకలదిండి, గనాల దిబ్బ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలను పరిశీలించారు. జిల్లాలో తుఫాన్ విపత్తును ఎదుర్కొనేందుకు చేసిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అన్నదాతల్లో ఆందోళన

మొంథా తుఫాను కారణంగా కోస్తాతీరం వెంబడి అతి భారీ వర్షాలు కురుస్తాయని, తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయనే హెచ్చరికలతో అన్నదాతలు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.60 లక్షల హెక్టార్లలో వరి సాగు జరిగింది. పెడన, మచిలీపట్నం, గూడూరు, పామర్రు మండలాల్లో వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేసిన పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. రెండు, మూడు రోజుల పాటు వర్షాలతో పాటు బలమైన గాలులు వీస్తే వరి నేలకొరిగి నీటిలో నాని పంట దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. కంకిపాడు, తోట్లవల్లూరు, ఉయ్యూరుతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో 1.20 లక్షల హెక్టార్లలో వరి పంట పాలు పోసుకునే దశలో ఉంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే వరి పంట నేలవాలి పోతుందని, అధిక వర్షాల కారణంగా పంట నీటిలోనే రోజుల తరబడి ఉండిపోతే నష్టపోతామని అన్నదాతలు భయపడుతున్నారు. ఏటా పంట కోత సమయంలో ఏదో ఒక విపత్తు రైతులను నష్టపరుస్తోందని కన్నీరు పెడుతున్నారు.

లక్ష రూపాయల పెట్టుబడి పెడితే నెలకు రూ.6 వేలు వడ్డీ వస్తుందని ఆశ చూపించి అనేక మందిని మోసం చేసిన అద్వికా ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కథ ముగిసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని బయటకు లాగడానికి ఏర్పాటైన సిట్ దర్యాప్తును ముగించింది. డబ్బు వసూలుకు మాస్టర్‌మైండ్‌ను ఉపయోగించిన కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య, ఆయన భార్య సుజాతతో పాటు 15 మందిని పోలీసులు అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఈ అరెస్టులను రెండు రోజుల్లో అధికారికంగా ధ్రువీకరించనున్నారు.

ముగిసిన అద్విక విచారణ



అద్విక ఎండీ ఆదిత్య

నిందితులుగా 15 మంది నిర్ధారణ

- ఏ1గా ఎండీ ఆదిత్య, ఏ2గా ఆయన భార్య సుజాత
- అధిక వడ్డీ పేరుతో పెట్టుబడుల వసూళ్లు
- రూ.500 కోట్ల వరకు వసూలు చేసినట్టు ధ్రువీకరణ
- రెండు రోజుల్లో అరెస్టు చూపే అవకాశం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేసే తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య కొన్నేళ్ల క్రితం నగరంలో అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశాడు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి ఎదురుగా ఉన్న భారీ భవనంలో ఈ సంస్థ కార్యకలాపాలు సాగాయి. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.6 వేలను వడ్డీగా చెల్లిస్తానని సులువుగా డబ్బు సంపాదించాలనుకునే వారికి ఎర వేశాడు. అతడి మాటలు నమ్మిన చాలామంది ఒకరిని చూసి మరొకరు పెట్టుబడులు పెట్టారు. ప్రారంభంలో మాత్రం.. ఇచ్చిన మాట ప్రకారం రూ.6 వేల వడ్డీని చెల్లించాడు. తర్వాత ఆశలు అంతస్థులకు ఎదగడంతో చాలామంది రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది జూలైలో ఖాతాదారులకు ఆదిత్య షాక్‌లు ఇచ్చాడు. ఒక్కొక్కరికీ భారీగా బకాయిలు పెట్టాడు. తెలంగాణ, ఏపీలో కలిసి మొత్తం 2 వేల మంది నుంచి రూ.500 కోట్ల వరకు వసూలు చేసినట్టు తేలింది. కంపెనీ ప్రారంభంలో ఖాతాదారులుగా చేరినవారు మిగతా 6లో..

సిట్ విచారణలో నిజాలు

ఈ కేసు దర్యాప్తునకు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి చీఫ్‌గా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆగస్టులో ఏర్పాటు చేశారు. ఈ సిట్ అద్విక లెక్కలను సాంకేతికంగా నిర్ధారించింది. లెక్కలు పూర్తిగా తేలడంతో ఆదిత్య, సుజాతతో పాటు వారికి సహకరించిన ఏజెంట్లు, ఉద్యోగులు మొత్తం 15 మందిని నిందితులుగా తేల్చారు. వారిలో కొంత మంది వేర్వేరు ప్రాంతాల్లో ఉండటంతో వారికోసం ప్రత్యేకంగా పోలీసు బృందాలను పంపారు. అందరికీ సంకెళ్లు పడ్డాక సంయుక్తంగా మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రైవేట్ బ్యాంక్‌లో రికవరీ మేనేజర్‌గా పనిచేసిన ఆదిత్య భార్య సుజాత ఓ ప్రైవేట్ బ్యాంకు లాకర్‌లో తమ బంగారు ఆభరణాలు ఉంచారు. పోలీసులు బ్యాంకులకు వెళ్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆమె తెలివిగా వాటిని విడిపించుకుని తీసుకెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సిట్ సిబ్బంది కొద్ది రోజుల క్రితం ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.



శివాలెత్తి..

కానిస్టేబుల్ 'ధన'కార్యాలపై అధికారుల సీరియస్

- విజిలెన్స్ నుంచి వెనక్కి పంపించే ఆలోచనలు
- అంతర్గత విచారణ.. వీఆర్‌కు పంపే యోచన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజిలెన్స్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కానిస్టేబుల్ 'శివతాండవాలను' అధికారులు ఒక్కొక్కటిగా బయటకు తీస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి గుంటూరు జిల్లా వరకు ఆయన చేసిన ఘనకార్యాల జాబితాలను పరిశీలిస్తున్నారు. ఆయన చెప్పినట్టుగా ఆడిన పేషీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'విజిలెన్స్‌లో శివతాండవం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇంతకుముందు ఆ కానిస్టేబుల్ పనిచేసిన ప్రదేశాల్లో విచారణ చేశారు. అన్ని వ్యవహారాల గురించి పక్కాగా తెలుసుకున్న అధికారులు విజిలెన్స్ నుంచి ఆ కానిస్టేబుల్‌ను తిరిగి మాతృ విభాగానికి పంపేయాలని నిర్ణయించారు.

అంతర్గత విచారణకు ఆలోచనలు

ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేసే ఆ కానిస్టేబుల్ ఎన్నికలకు ఏడాది ముందు విజిలెన్స్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లాడు. అక్కడ ఆయన సేవలను ఉపసంహరించడానికి రంగం సిద్ధం చేశారు. ఆయన్ను విజిలెన్స్ నుంచి ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌కు పంపడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయన ఇక్కడ రిపోర్టు చేయగానే ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచాలని అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత ఆయన చేసిన ఘనకార్యాలపై అంతర్గత విచారణ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.

అధికారులతో సమానంగా నెట్‌వర్క్

సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖలో అయినా రాష్ట్రస్థాయి అధికారులకే నెట్‌వర్క్ ఉంటుంది. ఆయా జిల్లాల్లో మిగతా 6లో..

యనమలకుదురు శివాలయంలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో రుద్రాక్ష శివలింగం





కార్తీక సందడి

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే శివ లింగానికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసి ఒత్తులను వెలిగించారు. యనమలకుదురు శివాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గుడ్లవల్లేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో రుద్రాక్ష శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యనమలకుదురులో తల్లితో కలిసి ఒత్తులు వెలిగిస్తున్న చిన్నారులు

దుర్గమ్మకు భారీ ఆదాయం

- 44 హుండీల ద్వారా రూ.4.33 కోట్ల కానుకలు
- 420 గ్రాముల బంగారం, 6 కిలోల వెండి కూడా..

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ భారీగా ఆదాయం లభించింది. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. మహామండపం ఆరో అంతస్థులో ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. 44 హుండీల్లోని 167 సంచులను తెరిచి లెక్కించారు. రూ.4కోట్ల33లక్షల85వేల655లతో పాటు 420 గ్రాముల బంగారం, 6 కిలోల 614 గ్రాముల వెండి, పలు దేశాల కరెన్సీ లభించాయి. 582 యూఎస్‌ఏ డాలర్లు, 22 సింగపూర్ డాలర్లు, 215 కెనడా డాలర్లు, 485 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దిర్హామ్స్), 15 సౌదీ రియాల్స్, 1 ఒమన్ బైసా, 18 ఖతార్ రియాల్స్, 23 మలేషియా రింగిట్స్, 15 యూరోప్ యూరోలు, 2 1/4 కువైట్ దీనార్‌లు, 250 ఆస్ట్రేలియా డాలర్లు, 15 ఇంగ్లండ్ పౌండ్లు లభించాయి. ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ఎస్పీఎఫ్, వన్‌టౌన్ పోలీసులు, అమ్మవారి సేవాదారులు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, ఉద్యోగులు, సేవా బృందం

మొత్తం అప్రమత్తం

- తుఫాను జోనల్ ప్రత్యేక అధికారి సిసోడియా

బాలికపై లైంగిక దాడికి వృద్ధుడి యత్నం

- పోక్సో కేసు నమోదు

కిక్కిరిసిన రైతు బజార్లు

8



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

కనకదుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను కార్తీక సోమవారం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో వీకే శీనానాయక్, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్తీకమాసం సందర్భంగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మల్లేశ్వరస్వామికి కార్తీక దీపాన్ని సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, కార్తీకమాసంలో అమ్మవారిని, స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణం



ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వాముల లీలా కళ్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారికి షష్టి తిథి జన్మతిథి రోజున విశేష అర్చనలు చేస్తారు. ఈ క్రమంలో కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం మేళ, తాళాల మధ్య భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్త, వేదోక్తంగా నిర్వహించారు. వివాహం కావాల్సిన వారికి ఆటంకాలు తొలగి త్వరగా వివాహాలు కావాలని రాహు, కేతు బాధలు తొలగాలని, కుజ దోష నివారణ నుంచి సంతాన ప్రాప్తి కోసం, వంశాభివృద్ధి కోసం సంకల్పం చెబుతూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని, వల్లీ దేవసేనలను వధూవరులుగా వేదిక పై ఉంచి ఆగమోక్త, శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని జరిపించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పాలకమండలి సభ్యులు, ఈవో శీనానాయక్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లేశ్వరాలయంలో..

మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పాలక మండలి సభ్యులు, ఈవో శీనానాయక్‌లు పాల్గొని ఆలయ స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 2,500 మందికి అన్న ప్రసాదం అందజేశారు.

భక్తుల భద్రతే ముఖ్యం.. : ఈవో



దుర్గగుడి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి : మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత నిమిత్తం ఆలయ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈవో వీకే శీనానాయక్ ఆదేశించారు. సోమవారం ఇంజనీరింగ్ అధికారులు, ఇతర విభాగాల ఉద్యోగులతో కలిసి ఆయన ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గం క్యూలలో భక్తులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలన్నారు. ప్రధాన ఆలయం, మహామండపం, దేవస్థానం చుట్టుప్రక్కల ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈవో వెంట ఏఈవో, పీఆర్వో కె.గంగాధర్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

100 రైలు సర్వీసులు రద్దు!



- మొంథా తుఫాను ఎఫెక్ట్.. రవాణా బంద్
- రైళ్లన్నీ ఎక్కడివి అక్కడే నిలిపివేత

విజయవాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం కారణంగా మంగళవారం కోస్తా జిల్లాల మీదుగా నడిచే 95 రైళ్ల సర్వీసులను విజయవాడ డివిజనల్ రైల్వే రద్దు చేసింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైళ్లు రద్దు చేసినట్టుగా ప్రకటించింది. ఈ మేరకు వేర్వేరుగా మూడు బులెటిన్లు విడుదల చేసింది. వీటితో పాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో.. విజయనగరం, విశాఖపట్నం మీదుగా రాజమండ్రి, మచిలీపట్నం, గుంటూరు, తిరుపతి, చెన్నై, సికింద్రాబాద్‌లకు వెళ్లే కొన్ని రైళ్లను రద్దు చేశారు. దీంతో కోస్తా జిల్లాల పరిధిలో 100కు పైగా రైలు సర్వీసులు రద్దు కావడం గమనార్హం.

రద్దు చేసిన రైళ్ల వివరాలు..

విజయవాడ-భీమవరం టౌన్(67281), భీమవరం టౌన్-నిడదవోలు (67283), నిడదవోలు-భీమవరం (67284), భీమవరం టౌన్-విజయవాడ(67282), విజయవాడ-రాజమండ్రి(67262), గుంటూరు-విజయవాడ(67230), విజయవాడ-కాకినాడ పోర్టు(17257), కాకినాడ పోర్టు-రాజమండ్రి(07523), విజయవాడ-తెనాలి (67221), తెనాలి-రేపల్లె (67231), రేపల్లె-తెనాలి (67232), తెనాలి-రేపల్లె (67233), రేపల్లె-గుంటూరు (67234),గుంటూరు-తెనాలి (67235), తెనాలి-రేపల్లె (67237), రేపల్లె-మార్కాపూర్ రోడ్డు(67238),మార్కాపూర్ రోడ్డు-తెనాలి(67239), తెనాలి-గుంటూరు(67236), గుంటూరు-విజయవాడ(67230), విజయవాడ-మచిలీపట్నం(67265), మచిలీపట్నం-గుడివాడ(67271), గుడివాడ-మచిలీపట్నం(67272), మచిలీపట్నం-విజయవాడ(67266), విజయవాడ-నర్సాపూర్ (67258), నర్సాపూర్-రాజమండ్రి(67246), విజయవాడ-రాజమండ్రి (67202), విజయవాడ-ఒంగోలు(67273), ఒంగోలు-విజయవాడ (67274), విజయవాడ-మచిలీపట్నం(67267), మచిలీపట్నం- విజయవాడ(67268), నర్సాపూర్-విజయవాడ(67276), విజయవాడ-మచిలీపట్నం(67269), భీమవరం టౌన్-నిడదవోలు(67277), నిడదవోలు-భీమవరం టౌన్(67278), భీమవరం టౌన్-నర్సాపూర్(17263), నర్సాపూర్- గుంటూరు (67247), గుంటూరు-రేపల్లె (67249), రేపల్లె-గుంటూరు (67250), మచిలీపట్నం-విజయవాడ(67256), విజయవాడ-నర్సాపూర్ (67257), నర్సాపూర్-నిడదవోలు(67244), నిడదవోలు-నర్సాపూర్ (67245), విజయవాడ-మాచెర్ల(67227), మాచెర్ల-విజయవాడ (67228), రాజమండ్రి-విజయవాడ(67201), రాజమండ్రి-విశాఖపట్నం(67285), విశాఖపట్నం-రాజమండ్రి (67286), రాజమండ్రి-విజయవాడ (67261), రాజమండ్రి-భీమవరం టౌన్(67241), భీమవరం టౌన్-నిడదవోలు (67242), నిడదవోలు-నర్సాపూర్ (67243), కాకినాడ పోర్టు-విజయవాడ(17258), కాకినాడ పోర్టు-విశాఖపట్నం(17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు (17268), తిరుపతి-విశాఖపట్నం(08584), విశాఖపట్నం-గుంటూరు(22875), గుంటూరు-విశాఖపట్నం(22876), తిరుపతి-విశాఖపట్నం(22708), మచిలీపట్నం-విశాఖపట్నం(17219), హైదరాబాద్-విశాఖపట్నం(12728), మహబూబ్‌నగర్-విశాఖపట్నం(12862), చెన్నై సెంట్రల్-విశాఖపట్నం (22870), భువనేశ్వర్-బెంగుళూరు(18463), సికింద్రాబాద్-విశాఖపట్నం (12740), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), భువనేశ్వర్-పాండిచ్చేరి (20851), విశాఖపట్నం-కాకినాడ పోర్ట్(17268), కాకినాడ పోర్ట్-విశాఖపట్నం (17267), లింగంపల్లి-విశాఖపట్నం(12806), చర్లపల్లి-షాలిమార్ (18046), నర్సాపూర్-భీమవరం(17264), సికింద్రాబాద్-భువనేశ్వర్ (17016), సికింద్రాబాద్-హౌరా(12704), గుంటూరు-రాయగడ(17243), రాయగడ-గుంటూరు (17244), హైదరాబాద్-భువనేశ్వర్ న్యూ(07165), భువనేశ్వర్ న్యూ-హైదరాబాద్(07166), తిరుపతి-పూరి(17480),పూరి-తిరుపతి(17479), కడప-విశాఖపట్నం(18522) తదితర రైళ్లను రద్దు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

ముంచుకొస్తున్న.. ముప్పు!



పొట్ట దశలో వరి పొలం

మొంథా తుఫాను అన్నదాత వెన్నులో వణుకు పుట్టిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. భారీ వర్షాలు పడితే మెట్ట పంటలు కకావికలం కానున్నాయి. పత్తి, మొక్కజొన్న చేతికి దక్కటం కష్టమేనని రైతులు అంటున్నారు. మిర్చి తోటలు, మాగాణి వరి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని, తుఫాన్‌తో మెట్ట రైతులు నిలువునా మునిగే పరిస్థితి నెలకొంది.

- భారీ వర్షాలతో పంటలన్నీ కకావికలమే
- మొక్కజొన్న చేతికి రావటం కష్టం
- మాగాణి వరి, మిర్చి తోటలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం
- 81,875 ఎకరాల్లో పత్తి, 30 వేల ఎకరాల్లో మిర్చి సాగు
- జిల్లా వ్యాప్తంగా 30 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/ఇబ్రహీంపట్నం)

ఈ ఏడాది జిల్లాలో 81,875 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఇప్పటికే అధిక వర్షాలు పత్తి చేలను దెబ్బతీశాయి. కాయలు పక్వానికి వచ్చే తరుణంలో వర్షాలు పత్తి చేను ఊసురుతీస్తున్నాయి. పల్లపు, లోతట్టు



భూముల్లో చెట్లు నిలువునా చచ్చిపోతున్నాయి. ఒకవైపు చేలు గుబురుగా ఉండటం, మరోవైపు గాలి తగలక ఫంగస్ తెగులు వ్యాపించటంతో తొలి కాపు దెబ్బతిన్నది. అడుగు భాగంలో పక్వానికి వచ్చిన కాయలు బూజు పట్టి నల్లగా మారాయి. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల లోపు గుడ్డి పత్తి, కాయ పత్తి వస్తుంది. పత్తి నాణ్యత తక్కువ కావటం వల్ల మార్కెట్లో వ్యాపారులు కొనకపోవటంతో రైతులకు నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో తుఫాన్ విరుచుకుపడితే పత్తి చేలు సర్వనాశనం అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వర్షాలతో మిర్చికి నష్టమే..

జిల్లాలో సుమారుగా 30 వేలఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేశారు. ప్రస్తుతం తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. కౌలుతో కలుపుకుని ఎకరాకు సగటున



రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. పూత, పిందె దశలో తోటలు కళకళలాడుతున్నాయి. అయితే గాలులతో కూడిన భారీ వర్షాలు పడితే తోటలు దెబ్బతింటాయని, గాలులకు పూత, పిందెలతో కూడా చెట్లు దూసుకుపోతాయని రైతులు పేర్కొంటున్నారు. అసలే గిట్టుబాటు ధర లభించకపోవటం వల్ల రెండేళ్ల నుంచి తీవ్రంగా నష్టపోయామన్నారు. తుఫాన్ వల్ల మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుంటంతో రైతులకు కంటి మీద కునుకు ఉండటం లేదు.

చేలల్లోనే మొక్కజొన్న..



మొక్కజొన్న రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఖరీఫ్ సీజన్‌లో నందిగామ డివిజన్‌లోనే పదివేల ఎకరాల్లో పైగా రైతులు మొక్కజొన్న సాగు చేశారు. పక్షం రోజుల క్రితమే పంట కోతకు వచ్చింది. రెండు మూడు రోజులు పొడి వాతావరణంలో పలువురు రైతులు యంత్రాల ద్వారా పంట కోయించారు. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రోజూ వర్షం పడుతుండటంతో మొక్కజొన్న కోయటానికి వీలుపడటం లేదు. చేలల్లోనే పంట తడుస్తున్నది. అక్కడక్కడ కంకుల నుంచి మొలకలు వస్తున్నాయి. ఎకరానికి కౌలు కాకుండా రూ. 25వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ తరుణంలో తుఫాన్ వల్ల భారీ వర్షాలు పడితే భారీ నష్టమే అంటున్నారు..

ముంపు భయంలో వరి రైతులు

జిల్లాలో చెరువులు, కాల్వలు, ఎత్తిపోతల పథకాల కింద లక్ష ఎకరాలకు పైగా రైతులు మాగాణి వరిసాగు చేశారు. ఎకరానికి రూ. 35వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పలుచోట్ల వరి కోత దశకు రాగా, కొన్ని ప్రాంతాల్లో పొట్ట దశలో ఉంది. ఈదురుగాలులు, వర్షాలు పడితే పంట వెన్ను విరుగుతుంది. పూర్తిగా నేలపై పడిపోవటం వల్ల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంటుందని, గింజ కూడా చేతికి దక్కదని రైతులు వాపోతున్నారు.

30 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు..

ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 30 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలకు మొంథా తుఫాను వల్ల నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. జిల్లా వ్యాప్తంగా మామిడి 22 వేలు, మిర్చి 8 వేలు, కూరగాయలు వెయ్యి, పసుపు 400, అరటి 150, బొప్పాయి 200, పువ్వులు 400, జామ, సపోట, డ్రాగన్‌ఫ్రూట్, నిమ్మ ఇతర రకాల పండ్ల తోటలు వెయ్యి, పామాయిల్ 4 వేల హెక్టార్లలో సాగవుతోందని జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.బాలాజీ కుమార్ తెలిపారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం..

- జిల్లాలో కలెక్టర్ లక్ష్మీశ సుడిగాలి పర్యటన
- క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం

కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ లక్ష్మీశ సోమవారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. మొంథా తుఫాను నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్షేత్రస్థాయిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విజయవాడ అర్బన్ పరిధిలో సున్నపుబట్టీల సెంటర్, గ్రంథాలయ రోడ్డు ప్రాంతంలో ఈనెల 24న కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, పరిస్థితిని అంచనా వేసి నివాసితులను పునరావాస శిబిరాలకు తరలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. మొగల్రాజపురం బీఎస్ఆర్‌కే మున్సిపల్ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, బెడ్డింగ్ మెటీరియల్, పారిశుధ్యం ఉండాలని స్పష్టం చేశారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని విపత్తు ప్రతిస్పందన పాయింట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.



వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాల్లో వర్షపు నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా డ్రెయిన్లను సిద్ధంగా వుంచాలన్నారు. గుర్రపుడెక్క వెంటనే తొలగించేలా చూడాలన్నారు. గ్రామ ప్రజల సమాచారం ఆధారంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో షిఫ్ట్‌ల వారీగా సిబ్బంది అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ పరిశీలన

జి.కొండూరు : మొంథా తుఫాన్ ప్రభావంతో బుడమేరు పరీవాహక ప్రాంతాల్లోని మండలాల్లో అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం పరిశీలించారు. గతేడాది బుడమేరుకు వచ్చిన ఫ్లాష్ ఫ్లడ్‌ను దృష్టిలో ఉంచుకొని అలాంటి పరిస్థితులు మరలా వస్తే ఎలా ఎదుర్కోవాలో రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందికి ఆయన వివరించారు. బుడమేరుకు వరద పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జి.కొండూరు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా వర్షం

(5వ పేజీ తరువాయి)

శిబిరాలకు తరలించారు. జిల్లాలో 180 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంత ప్రజలను అక్కడకు తరలించే ఏర్పాట్లలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం నిమగ్నమైంది.

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, నందివాడ, పామర్రు మండలాల్లో పర్యటించారు. ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశాల్లో వారు మాట్లాడారు. తుఫాన్ కారణంగా ఏర్పడే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఒర్లగొందితిప్పలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. బంటుమిల్లి, పెడన తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను పరిశీలించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బంటుమిల్లి మండలం ముంజులూరులో ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు

అందరూ అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ బాలాజీ

జిల్లాలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాలాజీ



కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్ప గోగిలేరు పాయలో తీరానికి చేరిన బోట్లు

హెచ్చరించారు. ఎవ్వరూ ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. పూరిళ్లు, పెంకుల ఇళ్లు, పాత గృహాల్లో నివాసం ఉండే వారు, లోతట్టు ప్రాంతాల ప్రజలు స్వచ్ఛందంగా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని చెప్పారు. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో ఎన్ని విద్యుత్ స్తంభాలు, ఎంత మేర విద్యుత్ వైర్లు, మనుషులను అందుబాటులో ఉంచారు అనే అంశాలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బలమైన గాలులకు ఆయా ప్రాంతాల్లో రహదారులపై చెట్లు విరిగి పడిపోతే, వెంటనే వాటిని తొలగించి, రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. నాగాయలంక సొర్లగొంది, మోపిదేవి మండలం బీసీ గురుకుల పాఠశాలలో, కోడూరు మండలం వి-కొత్తపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలను జేసీ ఎం.నవీన్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికపుడు పూర్తిస్థాయి సమాచారాన్ని జిల్లా అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

కాలువలకు నీరు నిలిపివేత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కృష్ణా డెల్టాకు సాగు నీటిని నిలిపివేసినట్టు కృష్ణా రివర్ కన్జర్వేటివ్ ఈఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కాలువలకు నీటి సరఫరా నిలిపివేశామన్నారు. సాగునీటి కాలువలతో పాటు డ్రెయినేజీలలోనూ ప్రస్తుతం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈఈ వివరించారు. ఈ నెలాఖరు వరకు పంట కాలువలకు నీరు విడుదల ఉండదని, వర్షం పరిస్థితులకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తామన్నారు. కాలువలు, డ్రెయిన్ల వద్ద క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి..

జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి



తుపాను ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారిణి డి.ఎం.ఎఫ్.విజయకుమారి రైతులకు సూచించారు. ప్రస్తుతం వరి, పత్తి పంటలకు ఈ తుపాను ప్రభావం ఉంటుందని, అయితే అధైర్య పడకుండా పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. చిన్నచిన్న యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను కాపాడుకోచ్చని వివరిస్తున్నారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో..

రైల్వేస్టేషన్ : మొంథా తుఫాను నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా, దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, ప్రయాణీకులు, సిబ్బంది రైల్వే ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాలను హై అలర్ట్ చేసింది. 29 వరకు తీరప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున, ప్రయాణికులు ఖచ్చితంగా అవసరమైతే మాత్రమే ప్రయాణించాలని అధికారులు సూచించారు. ప్రయాణికులు రైలు నడుస్తున్న స్థితిని తనిఖీ చేయాలని అభ్యర్థించారు. రైలు రద్దు, మళ్లింపులకు సంబంధించిన వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు. విజయవాడ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే ఎప్పటికప్పుడు సమాచారాలను ప్రకటిస్తాయన్నారు.

కొండపల్లి స్టేషన్‌లో పనులకు ఆమోదం

రైల్వేస్టేషన్ : కొండపల్లి స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి ఫలితంగా పనులను చేపట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే నుంచి అంబ్రెల్లా వర్క్స్ 2024-25లో ఆమోదం లభించింది. పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ విషయాన్ని లేఖ ద్వారా ఎంపీ శివనాథ్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన అద్విక విచారణ

(5వ పేజీ తరువాయి)

తర్వాత ఏజెంట్ల అవతారమెత్తారు. కొత్తగా ఖాతాదారులను తీసుకొచ్చిన వారికి కమీషన్లుగా 12 నుంచి 20 శాతం వరకు ఇస్తానని హామీలు ఇచ్చాడు. ఇలా ఎడాపెడా ఆశలు చూపించిన ఆదిత్య ఒక్కసారిగా బోర్డు తిప్పేశాడు. కమీషన్లకు ఆశపడిన ఏజెంట్లు తమకు పరిచయం ఉన్న వారందరినీ సభ్యులుగా చేర్పించారు. తర్వాత ఏజెంట్లు రూ.లక్షలు వెనుకేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు, ప్రభుత్వ అధికారులు, పలువురు పోలీసులు అద్వికలో పెట్టుబడులు పెట్టారు. తెలంగాణాకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.29 కోట్లను అద్వికలో పెట్టాడు. బాధితులంతా క్యూ కట్టడంతో మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదిత్య కుట్రపూరితంగా ఈ పెట్టుబడులు సేకరించినట్టు ప్రాథమికంగా గుర్తించిన పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు దర్యాప్తునకు సిట్‌ను నియమించారు. అద్విక ఖాతాల్లో వచ్చిన డబ్బు, ఈ ఖాతాల నుంచి ఎవరెవరి ఖాతాలకు ఎంతెంత వెళ్లిందన్న లెక్కలను సిట్ సాంకేతికంగా తేల్చింది.

శివాలెత్తి..

(5వ పేజీ తరువాయి)

పనిచేసే అధికారులతో సంబంధాలు ఉంటాయి. అలాంటి నెట్‌వర్క్‌ను ఈ కానిస్టేబుల్ నడిపినట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ గుంటూరు, ప్రకాశం జిల్లా వరకు ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాడని సమాచారం. ఇతర జిల్లాల్లో పీడీఎస్ బియ్యం లారీలను ఆపినా, క్రికెట్ బెట్టింగ్ ముఠాలను పట్టుకున్నా వారు నేరుగా విజిలెన్స్‌లో ఉన్న ఈ కానిస్టేబుల్‌కు ఫోన్ చేసేవారు. పట్టపగలైనా, అర్ధరాత్రయినా ఈయన ఆయా ఏరియాల పోలీసులతో ఫోన్లలో మాట్లాడి అప్పటికప్పుడు విడుదల చేయించేవాడు. ఇలా చేసినందుకు భారీగానే ముడుపులు అందుకున్నాడని అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ముఖ్యంగా విజయవాడలో కీలక విభాగంలో పనిచేసే అధికారుల పేర్లు చెప్పి బుకీల నుంచి భారీగా వసూళ్లు చేసినట్టు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. వన్‌టౌన్‌లోని బంగారం మాఫియాతో ఈయనకు బంధం ఉన్నట్టు ప్రాథమికంగా తేలింది. వసూళ్లకు సంబంధించి ఒక జాబితాను ప్రత్యేకంగా సమకూర్చుకున్నట్టు వినికిడి. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విదేశీయానాలు చేయడం వాస్తవమేనని అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఈ ప్రయాణాలకు సంబంధించిన టికెట్ల డబ్బు అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించే ముఠాల నేతల ఖాతాల నుంచి చెల్లించినట్టు విజిలెన్స్‌లో ప్రచారం జరుగుతోంది. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అతడిని విజిలెన్స్ నుంచి కమిషనరేట్‌కు సరెండర్ చేసి వీఆర్‌లో ఉంచాలని నిర్ణయించారు. ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక సమాచారం సేకరించిన అధికారులు వాటిపై మరింత లోతుగా విచారణ చేయబోతున్నారని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

నైపుణ్య పరీక్షలు వాయిదా

ప్రభుత్వాసుపత్రి : ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ నైపుణ్య పరీక్షలను నవంబరు 5, 6 తేదీలకు వాయిదా వేసినట్టు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వి.రాధికరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేసినట్టు వివరించారు. ఈ మార్పును అభ్యర్థులు గమనించాలని కోరారు.

క్వారీ పైనుంచి పడిపోయిన కార్మికుడు

- చికిత్స పొందుతూ మృతి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దొనబండలోని రాతి క్వారీలో పనిచేస్తున్న కాచవరం గ్రామానికి చెందిన ఉప్పుతల కృష్ణ (25) సోమవారం ప్రమాద వశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని చికిత్స నిమిత్తం నిమ్రా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పని ప్రదేశంలో సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే కృష్ణ కిందపడి చనిపోయాడని, మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నేతలు డిమాండ్ చేశారు.



మృతుడు ఉప్పుతల కృష్ణ

పెనమలూరు

● పెనమలూరు ● గన్నవరం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్‌బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

అందరి సహకారంతో గ్రంథాలయం అభివృద్ధి

గన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకు వెళతామని అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతా రామరావు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయ నూతన కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీతారామారావు మాట్లాడుతూ, పాఠకుల అభిరుచి మేరకు అవస రమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. దాతల సహకారంతో అదనపు భవన నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. కమిటీతోపాటు ప్రత్యేక ఆహ్వాని తులుగా టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్, పుణ్యచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్, జాస్తి వెంకటకృష్ణారావులను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా గన్నే వెంకట్రావుతో పాటు మరో 9 మంది సభ్యులతో కమిటీని నియమించినట్లు తెలిపారు.






తెన్నేరులో బుడమేరు వంతెన వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ మురళీకృష్ణ.. వీరవల్లి, ఆరుగొలను లోతట్టు ప్రాంతాల్లోని గుడిసెల్లో నివసిస్తున్న వారిని ఖాళీ చేయిస్తున్న ఎస్సై శ్రీనివాస్.. కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాలకు వెళ్లే కాజ్‌వే వద్ద రామిలేరు ప్రవాహ ఉధృతిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కె.రాజేంద్రబాబు, తహసీల్దార్ మురళీకృష్ణ.. వీరవల్లి వద్ద మురుగుకాల్వలో పూడిక పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్
● సహాయక చర్యల్లో అధికారులు
● క్షేత్రస్థాయి పరిశీలన, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల తరలింపు

ఉయ్యూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ముంచుకొస్తున్న పరిస్థితుల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణ నష్టం లేకుండా ఆస్తి నష్టం తక్కువగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. తుఫాను ప్రభావంవల్ల ఉయ్యూరు, పమిడిముక్కల మండలాల్లో భారీ వర్షసూచన వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయంలోమండలస్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖలవారిగా చేపట్టిన చర్యలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. రేకుల షెడ్లు, పూరిగుడిసె లు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తతో ఉండి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనాలన్నారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఉయ్యూరు కమిషనర్ రామారావు, చైర్మన్ సత్యనారాయణ, సీఐ టీవీవీ రామారావు పాల్గొని పలు సూచనలు చేశారు.

● మొంథాను తుపాను ఎదుర్కొనేందుకు మండల పరిధిలో అధికారులు అప్రమత్తత అయ్యారు. తుపాను ప్రభావంతో మండల పరిధిలో భారీ వర్షసూచన నేపథ్యంలో పంటలు ముంపునకు గురై నష్టపోకుండా మురుగు కాల్వల పూడికతీత పనులు చేపట్టారు. 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి పూరి పాకలు, గుడిసెల్లో ఉన్నవారిని తరలింపు చర్యలు చేపట్టామని తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో మురుగు కాల్వల పూడిక తీతపనులను ఎంపీడీవో శేషగిరిరావు, ఉద్యోగులు పరిశీ లించారు. ఉయ్యూరులో నాలుగు పునరావాస కేంద్రాలు అందులో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రామారావు తెలిపారు.

కంకిపాడు: మొంథా తుఫాను తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ భవన్నారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సీఐ మురళీకృష్ణతో కలిసి సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులపై చెట్లు నేలకొరిన పక్షంలో వాటిని తొలగించేందుకు అవసరమైన క్రేన్లు, కట్ చేసేందుకు మనుషులు, ప్రజలు ఇబ్బందులు ఎదురవకుండా ఉండే విధంగా మంచినీటి ట్యాంకులు, జనరేటర్లు ఏర్పాట్లను పరిశీలించారు. మద్దూరు, కాసరనేని వారి పాలెం గ్రామాల్లో పల్లెకారులను చేపల వేటకు వెళ్లవద్దు అంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో బుడమేరు కాలువను ఆయన పరిశీలించారు. కంకిపాడు ఎస్సైలు డి. సందీప్, తాతాచార్యులు, వీఆర్వో సూరిబాబు, టీడీపీ నాయకులు ఉద్దండి కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

గన్నవరం : మండలంలోని ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేక అధికారి చిరంజీవి ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో టెలి కాన్ఫరెన్స్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పూరి గుడిసెల్లో ఉండేవారు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండేవారిని గుర్తించి వెంటనే వారిని పునరావస కేంద్రాల్లో గాని, బంధువుల ఇళ్లకు గాని పంపించాలన్నారు. పునరావస కేంద్రాల్లో వసతులు కల్పించాలని చెప్పారు. తహసీల్దార్ కేవీ శివయ్య మాట్లాడుతూ, ఈ మూడు రోజులు అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు.



మొంథా తుఫానుపై అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

బాపులపాడులో ఆరు పునరావాస కేంద్రాలు

హనుమాన్‌జంక్షన్ : మొంథా తుపాను ప్రభావం కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని బాపులపా డు మండల ప్రత్యేక అధికారి కె.రాజేంద్రబాబు మండల స్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మొంథా తుపాను నేపథ్యంలో సోమవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో తీసు కోవాల్సిన ముందస్తు చర్యలపై ఎంపీడీవో జోగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంపు గురయ్యే ప్రాంతాల్లోని ఇబ్బంది ఎదురైతే ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఆరుగొలను, కానుమోలు, రామన్నగూడెం గ్రామాల్లో జడ్పీ హైస్కూల్స్ ఓగిరాల సచివాలయం, బొమ్ములూరు ఎంపీపీ స్కూల్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో జోగేశ్వరరావు తెలిపారు. అవసరాన్ని బట్టి మరి కొన్ని గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఈవోపీఆర్డీ లక్ష్మయ్య, ఎంఈవో రాంబాలసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అహమ్మద్, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మొంథా తుపాను హెచ్చరిక నేపథ్యంలో బాపులపాడు మండలంలోని ప్రభుత్వ అధికారులు అప్రమత్తమై క్షేత్రస్థాయిలో వాగుల్లో నీటి ప్రవాహాలను, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను సోమవారం మధ్యాహ్నం నుంచి చేపట్టారు. కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద రామిలేరు ప్రవాహ ఉధృతిని మండల ప్రత్యేక అధికారి కె.రాజేంద్రబాబు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ జోగేశ్వ రరావులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రవాహ ఉధృతి మరింత పెరిగే అవకాశమున్నందున ప్రయాణించేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. కాజ్‌వేకు రెండు వైపులా పోలీసు పహారా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీరవల్లి, ఆరుగొలను, తిప్పనగుంట గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వలస కార్మికులను, గుడిసెల్లో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని వీరవల్లి ఎస్సై శ్రీనివాస్, వీఆర్వో సునీల్ కుమార్ సూచించారు.



గన్నవరంలో రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ప్రత్యేక అధికారి చిరంజీవి

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోస్తా తీరాన్ని తాకనున్న మొంథా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. సోమవారం ఉదయం తుఫాను ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు ఫోన్‌లో పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, తీవ్ర తుఫాను కార ణంగా పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురు స్తాయని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని అన్ని మండల కేంద్రాల్లో హెల్ప్ లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఏదైనా విపత్తు ఎదురైతే వెంటనే స్పందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని అధికారులు ఎప్పటికప్పుడు తుఫాన్ సమాచారాన్ని ఉన్నతాధికారులకు, తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ కోరారు.

ప్రభుత్వ కృషితోనే సాగర్ 3వ జోన్‌కు సాగునీరు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కృషి వల్లే నాగార్జునసాగర్ 3వ జోన్‌కు సాగునీరు వచ్చిందని ఎన్‌ఎస్‌పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. సింగన్నగూడెంలో బాపులపాడు మేజర్ 14వ కిమీ దిగువన ఉన్న కోమటిగుంట చెరువు, తుమ్మలగుంట చెరువులకు నీటి విడుదలను సోమవారం రైతులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషి వల్ల నియోజకవర్గంలోని చిట్టచివరి ప్రాంతమైన బాపులపాడు మేజర్‌కు సాగర్ వరదజలాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌పీ డీఏఈ కె.సీతారావమ్మ, ఏఈఈ ప్రసన్నకుమార్, నీటి సంఘ అధ్యక్షులు తమ్మిశెట్టి రాంబాబు, బత్తుల సాంబశివరావు, ప్రతినిధులు అక్కినేని ధర్మరాజు, మరీదు వీరాంజనేయులు, రంగన్నగూడెం ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణారావు, అక్కినేని కృష్ణాజీ, చలమాల శేషయ్య, తమ్మిశెట్టి రంగారావు, అక్కినేని సత్యప్రసాద్, ఆయకట్టుదారులు పాల్గొన్నారు.

ఉషారామా కళాశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు



ఉంగుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలకు భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డ్-2025 లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్య, సాంకేతిక పరిశోధన, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిలో కళాశాల సాధించిన విశేష ఫలితాలకు గుర్తింపుగా బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్ హైటెక్ సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ సీఈవో డి.గణేష్‌నాగ్ చేతులమీదుగా కళాశాల ఎక్స్‌లెన్స్ అవార్డుతో పాటు, కళాశాల ఏఐ విభాగాధిపతి కేపీఎస్‌వీ సత్యశ్రీ జ్యేష్ఠ ఆచార్య అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు రెండు అవార్డులు లభించిన సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీకల్యాణ మండపంలో ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ట్రస్ట్ పూజా సామగ్రి అందజేసింది. అర్చకులు శ్రీధర్‌శర్మ వ్రతం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతం ఆచరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు వెత్సా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నేతలు, వాసవీ మాత ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్‌తో మాట్లాడుతున్న ఐలా కమిషనర్ సీతామహాలక్ష్మి

డ్రెయిన్లలో పూడిక తీయించాలి

మున్సిపల్ కమిషనర్‌ను కోరిన ఐలా కమిషనర్

కానూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రెయినేజీలో పూడిక తీయించాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్‌ను న్యూ ఆటోనగర్ ఐలా కమిషనర్ సీతామహాలక్ష్మి కోరారు. కానూరులో కమిషనర్‌ను సోమవారం కలిసి డ్రెయిన్ల సమస్యలను వివరించారు. తాడిగడప వంద అడుగుల రోడ్డులోని కానూరు న్యూ ఆటోనగర్ వైపు ఉన్న మేజర్ డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపజేయాలని విజ్ఞప్తి చేశారు. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోవడం వల్ల న్యూ ఆటోనగర్‌లోని మురుగునీరు సరిగా వెలుపలకు రావడంలేదని పేర్కొన్నారు. దీంతో న్యూఆటోనగర్‌లో మురుగునీరు నిలిచి దుర్వాసన కొడుతోందని ఈమె పేర్కొన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులను పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యూఆటోనగర్ ప్లాట్ ఓనర్స్ పి. రమేష్, కుమార్, నరసింహరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి. కిరణ్ పాల్గొన్నారు.



కంకిపాడు రైతు బజారులో పర్యటిస్తున్న విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు తుమ్మలపల్లి హరికృష్ణ

నాణ్యమైన కూరగాయలు విక్రయించండి

రైతుబజార్‌ను పరిశీలించిన కూటమి నాయకులు

కంకిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ సాకుగా చూపి ప్రజలపై అధిక భారం మోపితే కఠిన చర్యలు తీసుకుంటామని టీడీపీ సీనియర్ నాయకులు, విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు తుమ్మలపల్లి హరికృష్ణ హెచ్చరించారు. స్థానిక రైతు బజారులో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశాలకు అనుగుణంగా రైతు బజారులో పర్యటించటం జరిగిం దన్నారు. మొంథా తుపాను దృష్టిలో పెట్టుకొని రైతు బజారులోని రైతులు అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలు రైతు బజారులో కూరగాయలు కొనుగోలు చేసేందుకు కిక్కిరిసిపోయారన్నారు. రెండు గంటల వ్యవధిలోనే కూరగాయలు పూర్తి అయ్యాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, కాకుమాను రమేష్, వీరంకి శ్యామ్, జనసేన పార్టీ నాయకులు పిచుక క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

జాతిపితకు యార్లగడ్డ ఘన నివాళి

గన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మా గాంధీ సమాధి వద్ద ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నివాళులర్పించారు. న్యూఢిల్లీ వెళ్లిన యార్లగడ్డ సోమవారం ఉదయం సహచర ఎమ్మెల్యేలతో కలసి యమునా నది తీరంలోని మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీ మహాత్ముని సమాధిపై పుష్పాలను ఉంచి, జాతిపిత సేవలను స్మరించుకొని ఆయనకు ఘన నివాళులర్పించారు.



కానూరు మెయిన్‌రోడ్డులోని గుంతల్లో వర్షపునీరు

కానూరులో భారీవర్షం

రోడ్లు జలమయం.. గుంతల్లో వర్షపునీరు

కానూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీ కానూరు గ్రామంలో మొంథా తుఫాన్ నేపథ్యంలో సోమవారం భారీవర్షం పడింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. కానూరు మెయిన్‌రోడ్డుతోపాటు అంతర్గత రోడ్లు సైతం వర్షం వల్ల ఛిద్రంగా మారాయి. మెయిన్‌రోడ్డు, అంతర్గత రోడ్లలో ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. అన్ని సచివాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

రైతుబజార్ ఖాళీ..!

ఉయ్యూరు: మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో కూరగాయాల కోసం వినియోగదారులు ఎగబడడంతో సోమవారం ఉయ్యూరులో రైతుబజార్‌లో దుకాణాలు, బయట కూరగాయల దుకాణాలు కిక్కిరిశాయి. తుపాను ప్రభావం మూడు రోజుల పాటు ఉంటుందన్న హెచ్చరికలు చేస్తున్న పరిస్థితుల్లో కూరగాయలు అందుబాటులో ఉండవేమో అన్న ఆతృతతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడంతో కొద్దిసేపట్లోనే దుకాణాలు ఖాళీ అయ్యాయి.

శివాలయాల్లో కార్తీక శోభ



బాపులపాడులో అలంకరించిన శివలింగం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాపుల పాడు మల్లికార్జునస్వామి దేవాలయంలో కార్తీకమాసం మొదటి సోమవారంతో పాటు శుద్ధ షష్టిని పురస్క రించుకొని ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సామవేదం మారుతీశర్మ నేతృత్వంలో మరకత లింగేశ్వర స్వామికి మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరుకు చెందిన లోయ ప్రభాకర్, సత్యవతి దంపతులు ఆలయంలోని దేవతామూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, సభ్యులు తమిరి రమేష్, వీరమాచనేని నాగయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కార్తీక మాసంలోని మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన శ్రీముక్తి కాంత సమేత ముక్తేశ్వరాలయంలో అర్చకులు సీతారామయ్య, శ్యామ్, మహేష్ ఆధ్వర్యంలో ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు. తదనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. వీరవల్లిలోని శ్రీగంగా పార్వతీ సమేత కొండేశ్వరస్వామి దేవ స్థానంలో అర్చకుడు కుందుర్తి మురళీశర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వకరుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు.

కానూరు: కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని కానూరు మెయిన్‌రోడ్డులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చిన శివునికి, పార్వతీ అమ్మవారికి పూజలు నిర్వహించి హారతి అందుకున్నారు. ఆలయం పూజారులు ఫణి, కృష్ణ ఫణిలు పూజా క్రతువులు నిర్వహించారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

ఉయ్యూరు: ఉయ్యూరు, పరిసర గ్రామాల శివాలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. కార్తీకమాసం తొలిసోమవారం కావడంతో శివాలయాల్లో కార్తీకదీపారాధన చేసి పూజలు చేసేందుకు భక్తులు వేకువజామునుంచి తరలిరాగా ఆలయాల్లో భక్తుల సందడి కన్పించింది. శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో దీపారాధనలు, అభిషేకాలు, పూజలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కడవకొల్లు, ముదునూరు, కలవపాముల, కాటూరు, పెదఓగిరాల, చినఓగిరాల శివాలయాల్లో భక్తుల తాకిడి కన్పించింది.



ఉయ్యూరు శివాలయంలో కిక్కిరిసిన భక్తులు

కలెక్టర్ బాలాజీ బుడమేరు పరిశీలన

నందివాడ: మొంథా తుపాను కారణంగా సోమవారం పుట్టగుంట వద్ద బుడమేరు ప్రాంతాన్ని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. అనంతరం నందివాడ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. జనార్ధనపురంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ సోమవారం మధ్యాహ్నం నుంచి బుధవారం వరకు తీవ్రరూపం దాల్చుతుందన్నారు. మండల అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లోనే ఉండాలన్నారు. వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఎక్కడ ఏ గ్రామంలోను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వీఆర్వోలు జనాభా లెక్కలు లిస్టులు తయారు చేయాలని సూచించారు. తహసీల్దార్ గురుమూర్తి, ఆర్ఐ గణేష్, డిప్యూటీ ఎంపీడీవో అమీర్ మీర్జా బాషా, ఎస్ఐ శ్రీనివాస్, మండల అధికారులు పాల్గొన్నారు.

మొత్తం అప్రమత్తం

● తుఫాను జోనల్ ప్రత్యేక అధికారి ఆర్‌పీ సిసోడియా ● అధికారులతో సమీక్ష

మచిలీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తుపాను జోనల్ ప్రత్యేకఅధికారి, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సీసోడియా అన్నారు. తుపాను అప్రమత్తతపై కలెక్టర్, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లోని మినీసమావేశపు హాలులో సోమవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. తుపాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గర్భిణులు, డయాలసిస్ పేషంట్లను తరలించే విషయంలో అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. పునరావాసకేంద్రాల్లోని వారికి ఆహారం, తాగునీరు వైద్యసేవలు అందుబాటులో ఉంచాలన్నారు. 3 రోజులపాటు ప్రజలు ఇళ్లలోనే ఉండేలా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. కలెక్టర్ బాలాజీ, జేసీ ఎం నవీన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

పంటపొలాల మునక

మచిలీపట్నం టౌన్: మొంథా తుపాను ప్రభావంతో బందరు రూరల్ మండలంలో వరి, వేరుశనగ శనగ పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పంట చేతికందే దశలో ఉండగా వేరుశనగ పంటకు భారీ నష్టం వాటిల్లింది. శిరివెళ్లపాలెం, తాళ్లపాలెం, తపసిపూడి, మేకావారిపాలెం, కరగ్రహారం, మంగినపూడి, కొత్తపూడి, గోపువానిపాలెం గ్రామాల్లో దాదాపు 160 ఎకరాల్లో రైతులు వేరుశనగ నాటారు. పంట చేతికందే దశలో ఉండగా భారీ వర్షాలతో పంటకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో వేరుశనగ రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

వరిపంటకు వర్షం దెబ్బ

బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంట విభిన్నరీతుల్లో ఉంది. కొన్ని గ్రామాల్లో పంట చేతికందే దశలో ఉండగా, మరికొన్ని గ్రామాల్లో పొట్ట పోసుకునే దశలో ఉన్నాయి. పలు గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. డ్రెయిన్లకు సరిగా పూడిక తీయక ఈ దుస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లు పొంగుతున్నాయి. సీతారామపురం, ఎస్ఎన్‌గొల్లపాలెం గ్రామాల్లో వరి పంట ముంపునకు గురవుతోంది. వరి పంట చిరుపొట్ట దశలో ఉండటం వల్ల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికోతలు కోసే సమయంలో తుపాను వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరో రెండు రోజులు వర్షం కురుస్తుందన్న సమాచారంతో పంట పొలాలు మరింత కోలుకోలేని నష్టం వాటిల్లే అవకాశాలు ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలిరండి

మొంథా తుపాను దృష్ట్యా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తీర ప్రాంతాల ప్రజలు తరలి రావాలని అధికారులు కోరారు. గిలకలదిండిలోని పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ డీకే బాలాజీ, స్పెషల్ ఆఫీసరు అమ్రపాలి, జాయింట్ కలెక్టర్ నవీన్, తహసీల్దార్ మధుసూదనరావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు సందర్శించారు.



సీతారామపురంలో నేలవాలుతున్న పంటపొలాలు

అలాగే మంగినపూడి, పెదపట్నం పునరావాస కేంద్రాలను తహసీల్దార్ నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై సత్యనారాయణ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మచిలీపట్నం 50వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సందర్శించారు. పునరావాస కేంద్రాలకు తీర ప్రాంత ప్రజలను గుడిసె వాసులను, పాతకాలం నాటి శిథిలమైన గృహాల్లో నివసించేవారిని తరలింపు చర్యలు చేపట్టారు. చిన్నాపురం జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్నాన్ని మాజీ ఎంపిపి , బందరు రూరల్ మండలం అధ్యక్షుడు కాగిత వెంకట్రావు సందర్శించారు. కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ, బందరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు పలువురు టీడీపీ, జనసేన నేతలతో కలిసి సోమవారం పునరావాస కేంద్రాలను సందర్శించారు.



గిలకలదిండి పునరావాస కేంద్రాన్ని సందర్శించిన స్పెషల్ ఆఫీసర్ అమ్రపాలి, జాయింట్ కలెక్టర్ నవీన్, తహసీల్దార్ మధుసూదనరావు



కృత్తివెన్ను తహసీల్దార్ ఆఫీసులో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్

కృత్తివెన్నులో ముందస్తు జాగ్రత్తలు



కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం- పోడు రహదారిని బ్లాక్ చేసిన ఎస్సై పైడిబాబు

కృత్తివెన్ను: మొంథా తుపానును ఎదుర్కొనేందుకు అధికారులు, నేతలు, మరోపక్క రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. సోమవారం తుపాను ప్రభావం అంతగా లేకపోయినా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార వ్యవస్థ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఉదయం కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ మండలంలో పర్యటించి, ఒర్లగొందితిప్పలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించి లోతట్టు గ్రామ ప్రజలతో మాట్లాడారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పోడు, పడతడిక, ఇంతేరు, ఒర్లగొందితిప్ప గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అధికారులు, నేతలు అందుబాటులో ఉంటారన్నారు. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్‌యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, డీసీ నెక్కంటి బాస్కరరావు, పార్టీ మండలాధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు, కార్యదర్శి యాదంరెడ్డి కొండ, దేవస్థాన చైర్మన్ చేకూరి వెంకట్రావు పాల్గొన్నారు.

అప్రమత్తమైన అధికారులు

ఉన్నతాధికారుల పర్యటనల నేపథ్యంలో మండల అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి తేలికపాటి వర్షాలు, గాలి ఉండటంతో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలో 6 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసి, లోతట్టు గ్రామ ప్రజలను తరలించారు. అధికారులంతా రేయింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ, పరిస్థితులను సమీక్షిస్తూ జాగ్రత్తలు తీసుకుంటారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శశికుమార్ తెలిపారు. లక్ష్మీపురం నుంచి పోడు వెళ్లే రహదారిపై నీరు అధికంగా చేరి, రోడ్డు మునిగిపోవటంతో ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఎస్సై పైడిబాబు ఆ రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డును బ్లాక్ చేశారు. ప్రత్యామ్నాయంగా చందాల రోడ్డును వాహనదారులు వినియోగించుకోవాలని సూచించారు.

రైతులకు తప్పని తిప్పలు

మొంథా తుపాను ప్రభావంతో తమ పంటలను కాపాడుకొనేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. పొట్ట దశలోనున్న వరిపంటకు తుపాను తీరని నష్టాన్ని మిగిల్చేలా ఉందని, చేసేదేం లేక రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఆక్వా రైతులు మాత్రం తమ చేపలు, రొయ్యల చెరువులను కాపాడుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. డ్రెయిన్లు ఇప్పటికే పొంగి పొర్లటంతో చెరువుల్లోని సరుకు బయటకు పోతుందన్న భయంతో చెరువుల చుట్టూ వలలు కడుతున్నారు. నీటిని ఇంజన్లతో బయటకు తోడేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోపక్క వాతావరణం చల్లబడటం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న భయంతో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ కొరత రాకుండా నిరంతరాయంగా రేడియేటర్లు తిప్పేందుకు అదనపు జనరేటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటి కోసం డీజిల్‌ను ముందుగానే తగిన మోతాదులో ఉంచుకుంటున్నారు. మరోవైపు కృత్రిమ ఆక్సిజన్ కోసం ట్యాబ్‌లెట్లు, పౌండర్లను కూడా సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు తుపాను ప్రభావంతో మత్స్యకారులు తమ చేపల వేటను నిలిపి, బోట్లను ఒడ్డుకు చేర్చారు.



కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్పలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత

జేసీ నవీన్ పునరావాస కేంద్రాల సందర్శన

మోపిదేవి: మొంథా తుపాను ప్రభావంతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అధికార వ్యవస్థ పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ నవీన్ చెప్పారు. సోమవారం మండలంలోని మోపిదేవి వార్పు ప్రాంతాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలను పరిశీలించారు. మోపిదేవి వార్పు వద్ద మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలిం చారు. మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో 13 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వాటికి ఉద్యోగులను ఇన్‌చార్జులుగా నియమించటం జరిగిందని తహసీల్దార్ హరినాథ్ జేసీకి తెలిపారు. మండల ప్రత్యేకాధికారి హాజీ బేగ్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పీ సాయిబాబు, ఎంపీడీవో స్వర్ణభారతి, ఎంఈవో గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బాధితులకు భోజన వసతి

మండలంలోని కొక్కిలిగడ్డ, కే కొత్తపాలెం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బా ధితులకు భోజన వసతి గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొక్కిలిగడ్డ పాఠశాలలో సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు భోజనాన్ని ప్రారంభించారు.

కూరగాయల వితరణ

మొంథా తుపాను ప్రభావంతో ప్రభుత్వం నదీ తీర గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. మోపిదేవి మండలం కోసూరువారిపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. బాధితులకు సర్పంచ్ కోసూరు అనూష రూ.10వేల విలువైన కూరగాయలను అందజేశారు. కోసూరు నాగమల్లేశ్వరరావు, వీఆర్వో రమణ, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



దుకాణాలన్నింటికీ రేషన్ తరలించాలి

నాగాయలంక: ప్రజలకు రేషన్ అం దేలా అన్ని షాపులకు తరలించటంతోపాటు ప్రజలకు, గర్భిణులకు తక్షణ వైద్య సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు .జేసీ ఎం నవీన్ తెలిపారు. అ ధికారులను అప్రమత్తం చేసేందుకు సో మవారం నాగాయలంకలోని విద్యుత్ స బ్ స్టేషన్, రేమాలవారిపాలెం మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించారు. నాలిలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలోని 15 తీర ప్రాంత గ్రామాలకు 10 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా, 9 50 మంది తరలింపునకు ఆదేశాలిచ్చామన్నారు. తహసీల్దార్ వీరాంజనేయ ప్ర సాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, మత్స్యశా ఖ ఏడీ ఆర్ ప్రతిభ, ఏఎఫ్‌డీవో సునీత, సీఐ యువకుమార్, ఎస్ఐ పాల్గొన్నారు.



తుఫాను ముప్పు ప్రాంతాల్లో జేసీ పర్యటన

కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు జేసీ ఇలక్కియా, ఆర్డీఓ కావూరి చైతన్య సోమవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జేసీ కొండపల్లిలో పర్యటించి ముంపు పొంచి వున్న ప్రాంతాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో, ట్రక్ టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తిరువూరు ఆర్డీఓ కె.మాధురితో కలిసి తిరువూరులోని భగత్‌సింగ్ కాలనీ, గంపలగూడెం పునరావాస కేంద్రం, కట్టలేరు వాగు బ్రిడ్జిని పరిశీలించారు. నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోని విలియమ్స్ పేటను, ఊర చెరువును పరిశీలించగా, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య 46వ వార్డులోని దుర్బల (వల్నరబుల్) భవనాలను, సితార సెంటర్ వద్ద కొండ చరియల ముప్పు వున్న ప్రాంతాలలో పర్యటించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తుఫానును ఎదుర్కొనేందుకు చేసిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పటమట రైతుబజార్

కిక్కిరిసిన రైతుబజార్లు

● రికార్డు స్థాయిలో మధ్యాహ్నానికే సుమారు వెయ్యి టన్నుల అమ్మకం ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

విజయవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మూడు రోజుల పాటు అప్రమత్తత హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని రైతు బజార్లపై స్పష్టంగా ప్రభావం కనిపించింది. సోమవారం ఉదయం నుంచే వినియోగదారులు భారీ సంఖ్యలో బజార్లకు వచ్చి కూరగాయలు కొనుగోళ్లు చేశారు. న్యూస్ ఛానెల్స్ ద్వారా తుపాను అప్‌డేట్స్ చూసిన ప్రజలు ముందస్తు సన్నాహాల్లో భాగంగా రెండు జిల్లాల్లోని 22 రైతు బజార్లలో జనాలు బారులు తీరారు. ఎన్టీఆర్ జిల్లాలో 14, కృష్ణా జిల్లాలో 8 రైతు బజార్లలో రద్దీ ప్రభావం ఒకేలా కనిపించింది. నందిగామ, జగ్గయ్యపేట, పటమట, కేదారేశ్వరపేట, కృష్ణలంక, భవానీపురం, మచిలీపట్నం వంటి ప్రాంతాల రైతుబజార్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. సెలవు/పండగ రోజుల్లో కనిపించే రద్దీ కన్నా రెండు మూడు రెట్లు రద్దీ కనిపించింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రద్దీ తగ్గకపోవడం గమనార్హం. మధ్యాహ్నానికే బజార్లలో కూరగాయలు పూర్తిగా అమ్ముడుపోయాయి. సాధారణంగా ప్రతిరోజు తీసుకువచ్చే సరుకు కంటే రెట్టింపు మేర తెచ్చినా సరిపోలేదు. స్టాల్ నిర్వాహకులు అదనంగా నాలుగోవంతు కూరగాయలు తీసుకొచ్చి అమ్మకాలు జరిపారు. సాధారణ అమ్మకాలతో పోల్చితే సోమవారం రెట్టింపు వ్యాపారం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటున 400 టన్నుల కూరగాయల అమ్మకం జరిగేదని, తుపాను ప్రభావంతో సోమవారం మధ్యాహ్నానికే సుమారు వెయ్యి టన్నుల కూరగాయలు అమ్ముడుపోయాయని స్టాల్ నిర్వాహకులు తెలిపారు. తుపాను అంచనాలకు అనుగుణంగా రైతులు, వ్యాపారులు ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల రద్దీకి తగ్గట్టు సరుకును అందించగలిగారు. ప్రజలు మూడు రోజులకు సరిపడా కూరగాయలను తీసుకెళ్లడంతో బజార్లు త్వరగా ఖాళీ అయిపోయాయి.



మధ్యాహ్నానికే ఖాళీగా దర్శనమిస్తున్న రైతుబజార్

బాలికపై లైంగిక దాడికి వృద్ధుడి యత్నం

● పోక్సో కేసు నమోదు

ఉంగుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుని ఘటన మరువక ముందే కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, నారయ్య అప్పారావుపేటలో మరో ఘటన చోటుచేసుకుంది. 70 ఏళ్ల వయసులో ఉన్న వృద్ధుడు మనవరాలి వయసున్న బాలికపై (9)అత్యాచారానికి యత్నించినట్టు ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్సై ఎన్ లక్ష్మీనరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నిమ్మకూరి రత్నం (76) భార్యాపిల్లలెవరూ లేకపోవడంతో ప్రభుత్వ పింఛన్ డబ్బుతో ఒంటరిగా ఓ పూరిగుడిసెలో జీవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన 4వ తరగతి చదువుతున్న బాలిక పట్ల ఆదివారం రాత్రి అసభ్యంగా ప్రవర్తించడాన్ని 10వ తరగతి చదువుతున్న బాలిక అక్క (15) గుర్తించింది. వెంటనే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు వృద్ధుడిని నిలదీశారు. తానేమీ చేయలేదని వృద్ధుడు బుకాయించాడు. దీంతో తల్లిదండ్రులు బాలికను అడగ్గా తాత తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసునమోదు చేసి వృద్ధుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్సై తెలిపారు.



ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహిస్తున్న ప్రభాకరరావు (ఫైల్)

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో పర్వతారోహకుడు అనుమోలు పేరు

పెనమలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోరంకికి చెందిన పర్వతారోహకుడు అనుమోలు ప్రభాకరరావు పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదైంది. 67 ఏళ్ల వయోజ్ఞుడు ప్రభాకరరావు యూరప్‌లోని 5642 మీటర్ల ఎత్తయిన అత్యున్నత శిఖరం మౌంట్ ఎల్బ్రస్‌ను ఈ యేడాది ఆగస్టు 6న మరో పర్వతారోహకుడు బొబ్బా గోపాలకృష్ణతో కలిసి అధిరోహించినందుకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆయన పేరు నమోదయినట్లు సంస్థ ప్రతినిధులు సోమవారం అనుమోలుకు సమాచారం ఇచ్చారు. రికార్డు పుస్తకాల్లో నమోదయిన అనుమోలుకు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ కూటమి నేతలు అభినందనలు తెలిపారు. అనుమోలు ప్రభాకరరావు 2024లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని, 2024లో ఎవరెస్టు బేస్ క్యాంపును చేరి పర్వతారోహణలో తన సాహసాలను ప్రదర్శించి యువతలో స్ఫూర్తిని నింపారు.

ఎన్టీఆర్ వైద్యసేవలు నేటినుంచి బంద్

● ప్రభుత్వ వైఖరికి నిరసనగా సేవలు బంద్

విజయవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆషా) ఆధ్వర్యంలో 650 ఆసుపత్రుల్లో అన్ని రకాల ఎన్టీఆర్ వైద్య సేవలు ఇప్పటికే నిలిపివేశారు. మంగళవారం నుంచి ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లోను సేవలు నిలిపివేయాలని అసోయేషన్ సోమవారం నిర్ణయం తీసుకుంటూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించాయి. ప్రైవేటు కంటి ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద జరుగుతున్న వైద్య సేవలను నిలిపివేయాలని ఆషా తాజాగా నిర్ణయం తీసుకుంది. స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ సమ్మెకు విశాఖ హెల్త్ సిటీ హాస్పిటల్స్ మద్దతు ప్రకటించినట్టు తెలిపింది. ఆషా చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం వైఖరికి నిరసనగా మిగిలిన ఆసుపత్రులు కూడా మద్దతు తెలిపాయి.

స్విట్జర్లాండ్ విద్యాయాత్రలో స్కాట్‌స్పైన్ విద్యార్థులు



భారతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్కాట్‌స్పైన్ అంతర్జాతీయ పాఠశాల ఐఐఎంయుఎన్ ఆధ్వర్యంలో ఇటీవల స్విట్జర్లాండ్‌లో విద్యాయాత్ర 2025 జరిగింది. విజయవాడ స్కాట్‌స్పైన్ అంతర్జాతీయ పాఠశాల నుంచి సీఈవో కొడాలి జాహ్నవి, విద్యార్థులు మండవ కృష్ణ ప్రద్యుమ్న (టెన్త్), విట్టికుట్టి వైనవి (టెన్త్), గనిక ప్రణవ్ (9వ తరగతి), గన్నెడ శ్రీరుత్విక (8వ తరగతి) పాల్గొన్నారు. ఇందులో వీరు విశ్వవ్యాప్త నాయకత్వ లక్షణాలు వంటి అంశాలను మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ సీఈఆర్ఎన్, సంయుక్త రాష్ట్రాల ప్రధాన కార్యాలయాలను సందర్శించారు. ప్రస్తుతం జెనీవాలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయం, అంతర్జాతీయ సంస్థలకు స్విట్జర్లాండ్ శాశ్వత ప్రతినిధిగా ఉన్న జుర్గ్ లాబెర్, క్లైర్ వాల్ష్, లారెంట్ వెహర్లి, డేరెన్ టాంగ్ హెంగ్ షిమ్ లను కలుసుకున్నారు. ఏపీ తరపున పాల్గొనడానికి మొట్టమొదటి గొప్ప అవకాశాన్ని పొందింది స్కాట్‌స్పైన్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు మాత్రమేనని తెలిపేందుకు ఆనందిస్తున్నట్టు స్కాట్ స్పైన్ అంతర్జాతీయ పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులకు యాజమాన్యం, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రభారతి సంస్థల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, డైరెక్టర్ వీరమాచినేని శాంతి మాట్లాడుతూ ప్రపంచ వేదికపై తమ ప్రతిభను చాటిన విద్యార్థుల నైపుణ్యాలను కొనియాడారు

బాలికతో అసభ్య ప్రవర్తన.. ఇద్దరిపై పోక్సో కేసు

చందర్లపాడు: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ధర్మరాజు తెలిపారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామానికి చెందిన బాలికకు విజయవాడకు చెందిన ఒక యువకుడితో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో సదరు యువకుడు సోమవారం ముప్పాళ్ల వచ్చి ఇంట్లో ఉన్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. సమీపంలో ఉన్నవారు గమనించి కేకలేయడంతో పరారయ్యాడు. బాలికను వైద్యం నిమిత్తం నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో యువకుడితో పాటు సహకరించిన మరో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు అమరావతిలో జాబ్‌మేళా

కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్‌డీఏ సౌజన్యంతో అక్టోబరు 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆర్‌వీఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్, ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీఐఈఎల్ (ఈనాడు), దుర్గా ఏజెన్సీస్, మాత్రే హ్యూమన్ రిసోర్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్, ప్రింగిల్ ఐటీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, న్యూ చెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. వివరాలకు సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్, లేదా శ్రీకర్-9963425999 కాల్ చేయవచ్చు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

పేదవర్గాల సంక్షేమమే కూటమి ధ్యేయం : రావి

గుడివాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : పేదవర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ప్రజావేదికలో నియోజకవర్గ పరిధిలోని 15మంది బాధిత కుటుంబాలకు రూ.7.15లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకృష్ణ(నాని), మార్కెట్ యార్డు చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న రావి తదితరులు

తుఫాను ప్రభావం .. అధికారుల అప్రమత్తం



భద్రతా చర్యలకు సిద్ధంగా ఉన్న అగ్నిమాపక సిబ్బంది

ముందస్తు భద్రతా చర్యలకు సిద్ధం

గుడివాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను సందర్భంగా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా గుడివాడ అగ్నిమాపక శాఖ పరిధిలో ఎటువంటి విపత్తు జరిగిన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అగ్నిమాపక శాఖ అధికారి జె.ఆంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం రాత్రికి 8 రెస్క్యూ బృందాలు గుడివాడకు చేరకుంటాయన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో గానీ, తుపాను దిశను బట్టి ఈ బృందాల సేవలను అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు వినియోగించుకుంటామని ఆంజనేయులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్

ఆర్థిక సాయం

గుడివాడ : స్థానిక 36వ వార్డుకు చెందిన పంచర్ షాపు నిర్వాహకులు నాగేశ్వరరావుకు ఇటీవల రహదారి ప్రమాదంలో కాలు నుజ్జునుజ్జుంది. నాగేశ్వరరావుకు శస్త్రచికిత్స నిమిత్తం ఆయన కుటుంబసభ్యులకు జనసేన పట్టణ కమిటీ నాయకులతో కలిసి సోమవారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ బాలాజీ

పామర్రు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ప్రభావ దృష్ట్యా గ్రామాల్లో ఏ ఒక్కప్రాణహాని జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలందించారు. అనంతరం జరిగిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ మండలంలో పూరిల్లు, పురాతన గృహాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అందులో నివాసించే ప్రజల్ని తక్షణమే పునరావాస కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. డీఎల్‌డీవో రాజేష్, హౌసింగ్ ఈఈ వెంకటరావు, ఎంపీడీవో కాండ్రు జ్యోతి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, తహసీల్దార్ జి.రవికాంత్, ఆర్ఐ ఏ రాము, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : భారీ వర్షాలకు మండలంలో ఎక్కడా ఎవ్వరూ ఇబ్బందులకు గురికాకుండా మండల యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉన్నామని తహసీల్దారు లోకరాజు అన్నారు. సోమవారం మండలంలో ముంపు ప్రభావం అవకాశం ఉన్న గ్రామాల్లో తహసీల్దారు లోకరాజు, ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, ఎస్సై ఎస్.వి.వి.సత్యనారాయణ, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలతో కలసి పర్యటించారు. కౌతవరం, వడ్లమన్నాడు, అంగలూరు, విన్నకోట, డోకిపర్రు జిల్లా



గుడ్లవల్లేరులో..

• కలెక్టర్ డీకే బాలాజీ

పరిషత్ హైస్కూళ్లలో, గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 17పంచాయతీల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

కూచిపూడి : మొంథా తుఫాను ప్రభావం కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మండలంలో ఆరు పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. నిడుమోలు, భట్లపెనుమర్రు, పెదపూడి, మొవ్వ, కోసూరు, కాజ జడ్పీ పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లో వంట సామగ్రి, వసతులు, నిత్యావసరాలు, తాగునీరు, విద్యుత్ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. డిప్యూటీ కలెక్టర్ కుముదిని సింగ్ పునరావాస కేంద్రాలను



శేరివేల్పూరులో ప్రజలతో మాట్లాడుతున్న సరళ కుమారి

విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం

గుడివాడ రూరల్ : మండలంలో తుఫానుకు ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు మండల ప్రత్యేకాధికారి సరళకుమారి అన్నారు. సోమవారం గంగాధరపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రంలోని వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రతీ పునరావాసకేంద్రాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వాటర్, విద్యుత్ లేని విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా కొరత ఉన్నట్లైతే వాటిని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ముందు జాగ్రత్తగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. లింగవరంలో కొంతమందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో కార్యదర్శులు, వీఆర్వోలు, ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్, తహసీల్దార్ కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భట్లపెనుమర్రులో..

పరిశీలించి పరిస్థితులపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు అందజేశారు. తహసీల్దార్ కె.మస్తాన్, కూచిపూడి ఎస్సై కె.ఎన్.విశ్వనాథ్, ఆర్ఐ విజయదుర్గ పాల్గొన్నారు.

పమిడిముక్కల : మొథా తుఫాను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లుచేసినట్టు తహసీల్దార్ నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలో 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి వైద్యశిబిరాలు సమకూర్చినట్టు తెలిపారు. నాలుగు గ్రామాల నుంచి 300 మందిని పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చామన్నారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రం లో ఏర్పాట్లను టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు పరిశీలించారు.

పెదపారుపూడి : మొంథా తుపాను నేపథ్యంలో అధికారులు, కూటమి నాయకులు కలసి వెంట్రప్రగడ జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రంలో 52 మంది వసతులు కల్పించామని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు కలిగితే 9908664632కు ఫోన్ చేయాలన్నారు. మోపర్రు పాఠశాలలో ఇద్దరు మహిళలు ఉన్నారని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి, ఎంపీడీవో విమాదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో ఫణికుమార్, సాగర్ రాణి, శివనాగరాణి పాల్గొన్నారు.



పెదపారుపూడిలో..



చంద్రయ్య కాలువ గట్టుపై నివసిస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుడివాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా చంద్రయ్య కాలువకు అధికంగా వరద వచ్చే ప్రమాదముందని, గట్టు వెంబడి నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. పాత భవనాలు, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లను గుర్తించి వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఆదేశించామన్నారు. డ్రెయిన్లు, కల్వర్టులను జేసీబీలతో, కార్మికులతో శుభ్రపరుస్తున్నామన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ ఇంజిన్లు, డిస్టడ్డింగ్ మిషన్లను పెట్టించి క్లియర్ చేయిస్తున్నామన్నారు. ఏ సమయంలోనైన తక్షణ సహాయం అందించేందుకు పురపాలక సంఘం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెం. 87126 24774కు సంప్రదించాలని కమిషనర్ మనోహర్ సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తుఫాను బాధితులకు జనసేన అండ

గుడివాడ : మొంథా తుఫాను బాధితులకు సహాయ, సహకారాలకు జనసేన నాయకులు సిద్ధంగా ఉన్నారని, నియోజకవర్గంలో ప్రజలకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చిన నిత్యం అందుబాటులో ఉండటానికి జనసేన నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, నీరు, ఆహారం, వైద్య సేవలు ఏమైన కావలసిన వారు వెంటనే సెల్ : 99488 33889కు సమాచారం అందిస్తే సహాయ,సహకారాలు అందించేందుకు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని బూరగడ్డ పేర్కొన్నారు.

గంగానమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

గుడ్లవల్లేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గంగానమ్మ అమ్మవారు, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు నవంబరు 1 నుంచి 3 వరకూ, 7 నుంచి 9 వరకూ సంబర మహోత్సవాలు నిర్వహించనున్నామని నిర్వాహక కమిటీ సభ్యులు వల్లభనేని వెంకట సుబ్బారావుచౌదరి సోమవారం తెలిపారు. గుడ్లవల్లేరు గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి మందిరం శతాబ్దం క్రిందట నిర్మించారు. ఆలయం పురాతనమై శిథిలావస్థకు చేరుకోగా ఆలయ జీర్ణోద్ధరణ, నూతన ఆలయ నిర్మాణం, నూతన గంగానమ్మ అమ్మవారు, పోతురాజు విగ్రహాల ఏర్పాట్లకు దాదాపు 30 లక్షల వ్యయంతో గ్రామస్థుల, భక్తుల భూ విరాళాలతో చేశామని తెలిపారు. కాగా నవంబరు ఒకటో తేదీ నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమౌతాయన్నారు. మూడవ తేదీ సోమవారం ఉదయం 10-43లకు అమ్మవారి, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠలు నిర్వహించనున్నామన్నారు. అదే రోజు భారీగా 6 వేల



గుడ్లవల్లేరులో నూతనంగా నిర్మించిన గంగానమ్మ ఆలయం

మందికి అన్నసమారాధన నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఉత్సవాలకు సంబందించిన ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. కాగా నవంబరు 7వతేదీ నుంచి 9వ తేదీ వరకూ సంబర మహోత్సవాలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వల్లభనేని వెంకటరావు,కొనరాజు బాపయ్యచౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, రామకోటేశ్వరరావు, యెనిగళ్ల నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు,పోలవరపు వెంకటరావు, పొట్లూరి రవికుమార్, మురాల నరేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ధ్యేయం

• వీరంకి వెంకట గురుమూర్తి

తోట్లవల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫానుకు ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసి ఆదుకోనున్నామని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తెలిపారు. తోట్లవల్లూరు తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ వచ్చి తహసీల్దార్ ఎం కుసుమకుమారితో సమావేశమయ్యారు. తుపాను సహాయ చర్యలను అడిగి తెలుసుకున్నారు. కుమ్మమూరులో కాలువ కట్టపై నివసిస్తున్న 46 మందిని, గరికపర్రులో చెరువు కట్టపై నివసిస్తున్న 15 మందిని, పొట్టిదిబ్బలంక నుంచి దేవరపల్లి పాఠశాలకు 25 మందిని, బొడ్డపాడులో 10 మందిని పునరావాస శిబిరాలకు తరలించామన్నారు.



మొంథా తుఫాను సహాయ చర్యలకు తహసీల్దార్ కుసుమ కుమారితో చర్చిస్తున్న గురుమూర్తి, శివరామ్

బలహీనమైన పూరిళ్లల్లోని ప్రజలను తక్షణమే శిబిరాలకు తరలిస్తున్నామని తహసీల్దార్ వివరించారు. ఆహారం సైతం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులు అలెర్ట్ చేశామని ఎలాంటి సహకారమైనా అందిస్తామని వారన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి తుఫాన్ ఎఫెక్ట్ ఉంటుందని, అధికారులకు సహకరించాలని కోరారు.

సిద్ధాంతం వంతెనపై రాకపోకలు నిలిపివేత

గుడివాడ రూరల్ : మొంథా తుపాను దృష్ట్యా సిద్ధాంతం పంట కాలువ వద్ద గల వంతెన బలహీనంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుటకు అవకాశం ఉన్నందున వంతెనను తాత్కాలికంగా మూసివేసినట్లు రూరల్ ఎస్సై చంటిబాబు తెలిపారు. ఈ వంతెనను వినియోగించే సిద్ధాంతం, సెరివేల్పూరు, చౌటపల్లి, పరిసర గ్రామాల ప్రాంత ప్రజలు ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



వంతెనపై రాకపోకలు నిలిపివేసిన పోలీసులు



ముబారక్ సెంటర్‌లో గోతులను చూపుతున్న సీపీఎం నాయకులు

రహదారికి మరమ్మతులు చేపట్టాలని నిరసన

గుడివాడ : పట్టణంలోని బంటుమిల్లి రోడ్డు, బైపాస్ రోడ్డు, కోతిబొమ్మ సెంటర్, ఐఎంఏ హాల్ రోడ్డులలో ఏర్పడిన గోతులను వెంటనే పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ముబారక్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో భారీవర్షాలకు గోతులు నిండి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చొరవ తీసుకుని ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రహదారులు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రజిని, ఆర్.కొండ, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అబ్దుల్ కలాం అవార్డు

గుడివాడ : దక్షిణాది రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభావంతమైన నిష్ణాతులైన వారికి సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో స్థానిక వికాస్ రెయిన్‌బో పాఠశాల అధినేత పుట్టి రామచంద్రశేఖర్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం-2025 అందుకున్నారు. సోమవారం స్థానిక సత్యనారాయణపురంలోని పాఠశాల ఆవరణలో పురస్కార గ్రహీత పుట్టిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు

గుడివాడ రూరల్ : నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు మల్లాయిపాలెం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ తెలిపారు. సోమవారం మల్లాయిపాలెంలోని రెండు రక్షిత మంచినీటి సరఫరా కేంద్రాల వద్ద జనరేటర్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో మండల వ్యాప్తంగా పంచాయతీల్లో నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. డ్రెయిన్లలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మొహ్మమద్ ఇస్సాక్, షేక్ నూర్, గంగాధరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత పనులు

గుడ్లవల్లేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం వర్షం నీటికి డ్రెయిన్లు పొంగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని ప్రధాన మురుగు కాల్వల పూడికతీతలు, అడ్డీలు ఏమైనా ఉంటే వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించే పనులు పంచాయతీ శానిటరీ సిబ్బంది నిర్వహించారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు సూచించారు. అలానే మొంథా తుఫాను కారణంగా ముంపునకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించామని నరసింహారావు తెలిపారు.



గుడ్లవల్లేరులో డ్రెయిన్లలో పూడిక తీస్తున్న సిబ్బంది

తుఫాను కారణంగా ప్రజలకు ఏ ఇబ్బంది కలిగినా వారికి సహాయం కోసం సిబ్బంది అందరూ అందుబాటులో ఉంచామన్నారు. మురుగుకాల్వల పూడికతీత పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం 31న

గుడివాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దొండపాడులో వేంచేసి ఉన్న ఉమా గంగా సహిత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 29వ తేదీన జరగాల్సిన బిళ్వార్చన, అన్నసమారాధన వాయిదా వేసినట్లు గ్రామస్థులు, భక్తులు వి.రవి సోమవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీన బిళ్వార్చన, అన్నసమారాధన జరుగుతాయని, భక్తులు గమనించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు



గుడివాడలో..

గుడివాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధానమైన పెద్ద శివాలయం, చిన్న శివాలయాల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తెల్లవారుజాము 4గంటల నుంచే నిరంతర దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. గుడివాడ సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళ భక్తులు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, భక్తులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో భక్తులు శివాలయాలకు వేకువజాము నుంచే చేరుకుని పూజలు నిర్వహించారు. శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడ్లవల్లేరు సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన లక్షరుద్రాక్షల శివలింగానికి భక్తులు



నందివాడలో..

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మొదటి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు పరమ పవిత్రంగా భావించే కార్తీకమాసం వేలాది మంది భక్తులు తెలువారుజాము నుంచే స్వామిని దర్శించుకున్నారు

స్వయంగా పాలాభిషేకాలు నిర్వహించి పూజలు నిర్వహించారు. కౌతవరం గౌతమేశ్వరాలయం, అంగలూరు అమరలింగేశ్వరాలయం, విన్నకోట సిద్ధేశ్వరాలయం, వెణుతురుమిల్లి రామలింగేశ్వరాలయం, డోకిపర్రు, వడ్లమన్నాడు, పెసరమిల్లి శివాలయాల్లో అభిషేకాలు, బిల్వపత్రార్చనలు నిర్వహించారు. వర్షంలో సైతం భక్తులు శివాలయాల్లో పూజల్లో పాల్గొన్నారు.

కూచిపూడి : కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాల ఆవరణలో ఉన్న ఉసిరి, మారేడు చెట్ల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, అలంకరణ, అర్చన, విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. కూచిపూడి, చినముత్తేవి, పెదపూడి, అయ్యంకి, నిడుమోలు, మొవ్వ, బార్లపూడి, యద్దనపూడి, పెడసనగల్లు తదితర దేవాలయాల్లో కార్తీక సోమవారపు పూజలు నిర్వహించారు.

నందివాడ : కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని పోలుకొండ, తమిరిశ, కుదరవల్లి, జనార్ధనపురం గ్రామాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఓం నమ:శివాయ అంటూ శివ



కూచిపూడి శివాలయంలో ..

నామస్మరణతో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు : కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా పామర్రు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువజామునే స్థానిక పుల్లేటి కాల్వలో స్నానాలు ఆచరించి, శివునికి ప్రీతికరమైన పుష్పాలతో దూప, దీపాలతో నైవేద్యాలు సమర్పించి కార్తీకమాస పురాణం చదివి ఉసిరిచెట్టు కింద దీపారాధనలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం సంధ్యాసమయంలో ఆలయ ప్రాంగణంతోపాటుగా హరిహరపుత్రుడు అయ్యప్పస్వామి సన్నిదానంలో ఆకాశదీపాలు, సామూహిక కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం స్వామికి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మండల పరిధిలోని ప్రాకర్ల, రాపర్ల, పెదమద్దాలి, కురుమద్దాలి, శివాలయాల్లో కార్తీకమాస పూజలు ఘనంగా జరిగాయి.



పామర్రులో..

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575	

మోటమర్రి శ్రీదేవికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నివాళి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ సతీమణి మోటమర్రి శ్రీదేవి సేవలు మరువలేమని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు అన్నారు. మోటమర్రి శ్రీదేవి సంతాప సభ సోమవారం ఈడేపల్లిలో జరిగింది. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీం బేగ్, నాయకులు కొనకళ్ల బుల్లయ్య, అక్కుమహంతి రాజా, మామిడి మురళీకృష్ణ, టీడీపీ కార్పొరేటర్లు చిత్త జల్లు నాగరాము, అన్నం శ్రీఆనంద్, దింటకుర్తి సుధాకర్, తలారి సోమశేఖర్, ఇలియాస్ పాషా, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముంజులూరు పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగరనాయుడు



వి.కొత్తపాలెం పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు తెలుసుకుంటున్న జేసీ నవీన్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



ఏటిమొగ - ఎదురుమొండి పంటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజా

తుఫాను ముప్పును సమర్థంగా ఎదుర్కొంటాం

● ప్రజలు అధికారులకు సహకరించాలి ● తీరప్రాంతంలో కలెక్టర్ బాలాజీ విస్తృత పర్యటన ● ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు, కూటమి నేతలు

బంటుమిల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్, ఎస్పీ అధికారులకు పలు సూచనలు చేశారు. ముంజులూరు జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఏ ఒక్క ప్రాణ నష్టం జరగకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పూరిళ్లు, పాకలు, పెంకుటిళ్లు, శిథిల గృహాల్లో ఉండే ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించారు. మండలంలో ఎనిమిది పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దాదాపు 358 మంది పునరావాస శిబిరంలో తల దాచుకుంటున్నారు. పెందుర్రులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. మాజేటి శివ శ్రీనివాసరావు, అజయ్ ఘోష్, గౌరిశెట్టి నాగేశ్వరరావు,వెంట్రపాటి రాంబాబు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు. **పెడన** : తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ సోమవారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలసి సోమవారం పెడనలో పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తల గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. తహసీల్దార్ కె. అనిల్ కుమార్, కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. **పెడన రూరల్** : మండలంలో 24 గ్రామ పంచాయతీలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో అరుణకుమారి, తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. ప్రజలు ఇళ్ల వద్దనే ఉం డాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్నిచర్యలు చేపట్టామన్నారు. కలెక్టర్ బాలాజీ తుఫాన్ రక్షిత చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బందరు మండలంలో 11 పునరావాస కేంద్రాలు

మచిలీపట్నం టౌన్ : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన వివిధ గ్రామ పంచాయతీలను సందర్శించారు. గ్రామపంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. గుడిసెల్లో, సముద్ర తీర ప్రాంతాల్లోని గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మొంథా తుపాను దృష్ట్యా బందరు మండలంలో 11 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. పునరావాస కేంద్రాలను తహసీల్దార్లతో పాటు ఎంపీటీవో వెంకటేష్, ఈవోఆర్డి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించారు.

జేసీ పునరావాస కేంద్రాల సందర్శన

కోడూరు : మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను జాయింట్ కలెక్టర్ నవీన్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య ం ఏర్పాట్లను పరిశీలించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా అధికారులు శ్రద్ధ వహించి విపత్తును ఎదుర్కోవాలన్నారు. కోడూరు శివారు స్వతంత్రపురం, వి.కొత్తపాలెం పాఠశాలల్లో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి తెలిపారు. సోమవారం పోలీసు, రెవెన్యూ సహకారంతో రామకృష్ణాపురం, ఉల్లిపాలెం, పాలకాయతిప్ప, హంసలదీవి, చింతకోళ్ల, మందపాకల గ్రామాల నుంచి 359 మంది పేదలను ప్రత్యేక వాహనాలలో పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ శిబిరాల్లో 1000 మందికి ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. శిబిరాల్లో ఏర్పాట్లను నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు, డీఎస్పీ రాజా, సీఐ యువకుమార్ పర్యవేక్షించారు. తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఎంఈవో రామదాసు, ఎస్సై చాణిక్య, మెరైన్ ఎస్సై పూర్ణమాధురి పాల్గొన్నారు. **నాగాయలంక** : డీఎస్పీ సిహెచ్.రాజా సంగమేశ్వరంలోని పునరావాస కేంద్రాన్ని, ఏటిమొగ - ఎదురుమొండి పంటు ప్రాంతాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సదుపాయాలను పరిశీలించారు. ఎస్సై రాజేష్ ఉన్నారు. తుఫాను బాధితులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. ఇరిగేషన్ ఏఈ రవితేజ, విశ్వనాథపల్లి భీక్షం, నాగరాజు, నక్కా విజయబాబు తదితరులు ఉన్నారు.

చల్లపల్లిలో ముందస్తు చర్యలు

చల్లపల్లి : మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మండలంలో 11 కేంద్రాలను ప్రారంభించి అధికారుల బృందం సహాయక చర్యలకు సిద్ధంగా విధుల్లో ఉన్నారు. తుఫాను తీవ్రత ఉంటే చల్లపల్లి, ఆముదార్లంక, మాజేరు, లక్ష్మీపురం గ్రామాలలో సుమారుగా 400 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వస్తుందని అంచనా వేశారు. గ్రామాల్లో ఎంపిక చేసిన ఆయా పునరావాస కేంద్రాలను తహసీల్దార్ డి.వనజాక్షి, సీఐ కె.ఈశ్వరరావు, ఎంపీడీవో ఆనందకుమారి, ఎస్సై సుబ్రహ్మణ్యం పరిశీలించి కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బందికి సూచనలు అందించారు. మండల ప్రత్యేకాదికారి, డిప్యూటీ సీఈ వో ఆర్‌వి.ఆనందకుమార్ చల్లపల్లి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి, పరిస్థితిని అధికారులతో సమీక్షించారు. వరిపొలాలు పాలుపోసుకునే దశలోనూ, గింజ తయారీదశలోనూ ఉండటంతో వర్షం, గాలులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఘంటసాల: తుపాను ప్రభావ నేపథ్యంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి బాబ్జి హెచ్చరించారు. తెలుగురావుపాలెం, శ్రీకాకుళం గ్రామాల్లో పర్యటించి శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్ పునరావాస కేంద్రాన్ని మండల స్థాయి అధికారులతో కలసి సందర్శించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరుగకుండా చూడాలన్నారు. శ్రీకాకుళం పునరావాస కేంద్రానికి ఎస్టీ కుటుంబాలను తరలించగా, తెలుగురావుపాలెం ఆర్‌సీఎం చర్చి వద్దకు ఓ కుటుంబాన్ని తరలించారు. కొడాలి జడ్పీ హైస్కూల్ పునరావాస కేంద్రానికి ఎనిమిది కుటుంబాలను తరలించారు. తహసీల్దార్ విజయ ప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మండలి సమీక్ష

అవనిగడ్డ : తీర ప్రాంత గ్రామాల్లో డ్రైనేజీ సమస్య కారణంగా ముంపు సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్ బాబుతో ఎమ్మెల్యే డ్రైనేజీ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఎక్కడా ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ డీఈ బాబూ నాయక్, ఏఈ చిరంజీవి పాల్గొన్నారు. పులిగడ్డ, ఎడ్లంక గ్రామాల్లో నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో టీడీపీ నేతలు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మండలి వెంకట్రామ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించి జిల్లా కలెక్టర్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మండలంలో 10 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ శివప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్, ఎంపిడివో మరియకుమారి తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డ గ్రామంలో టీడీపీ నేతలు పర్యటించారు. స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. విద్యుత్, తాగునీరు సేవలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి రామ్మోహనరావు, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, గుంటూరు వినయ్, నాగిడి రాంబాబు, చెన్ను బాబురావు, కొల్లూరి వాసు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, నాగిడి వెంకటేశ్వరరావు, నాగిడి శివ నాగేశ్వరరావు, నాగమల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.





కంకటావలో పర్యటిస్తున్న టీడీపీనేత బూరగడ్డ వేదవ్యాస్, గూడురులో పునరావాస కేంద్రం

తుఫాను నుంచి రక్షణకు పటిష్ట చర్యలు : వేదవ్యాస్

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాను నుంచి రక్షణకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కంకటావ పంచాయతీ కత్తిరెడ్డిపాలెంలో శిథిలావస్థకు చేరిన వంతెనను పరిశీలించారు. కాలువల కట్టలు తెగకుండా పలు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అంటు రోగాలు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ జరిపించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వాకా శ్రీను, రవీంద్రనాథ్‌ఠాగూర్, గంగన్న, తెన్నేరు బాబు, భాను, సాంబ, పాల్గొన్నారు. మండలానికి ప్రత్యేక అధికారిగా నియమితులైన జిల్లా మైనారిటీ అధికారి అబ్దుల్ రబ్బానీ సోమవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పరంగా చేపట్టవలసిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆకులమన్నాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని పరిశీలించారు. తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి, ఎంపీడీవో పి. శైలజాకుమారి, వీఆర్వో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తరకటూరు, రాయవరం, పోలవరం, మల్లవోలు గ్రామ పంచాయతీ అధికారులు, కూటమి నాయకులతో డీసీ చైర్మన్ పోతన స్వామి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో భోజన ఏర్పాట్లను పరిశీలించి భోజ నం వడ్డించారు. పెడన మార్కెట్ యార్డు డైరెక్టర్ శాయన సోమయ్య, ఎన్ఏ బేగ్, కారుపర్తి మల్లి, పిచ్చుక విజయ్, బత్తిన వీరబాబు, కాట్రగడ్డ సత్యనారాయణ, చిన్నం చంటిబాబు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కోలపల్లి రజని, మునగాల భాస్కర్, ఎర్రపోతు అయ్యప్ప, కాట్రగడ్డ కేశవ, కిరణ్ పాల్గొన్నారు.



నడకుదురు పృథ్వీశ్వరస్వామి



నాగాయలంకలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కృత్తివెన్ను భక్తులకు ఉచితంగా పాలు పంపిణీ

శివాలయాల్లో కార్తీక పూజలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో శివాలయాల్లో పరమశివునికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి, గొడుగుపేట శాంతామల్లేశ్వర స్వామి, బచ్చుపేట మల్లేశ్వర స్వామి, సర్కిల్‌పేట మల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు దీపారాధనలు చేశారు. **పెడన** : పెడనలోని గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. మహిళలు ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. అర్చక బృందం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జి.వి. కృష్ణారావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ళ ప్రసాద్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. **కృత్తివెన్ను** : కార్తీక మాసం మొదటి సోమవారం మండలంలోని ఆలయాలన్ని భక్తులతో కిక్కిరిసాయి. ప్రముఖ ప్రసిద్ధి గాంచిన పుణ్య క్షేత్రం కృత్తివెన్ను శ్రీ దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత పాలు అందించినట్లు ఆలయ చైర్మన్ చేకూరి వెంకట్రావు తెలిపారు. **నాగాయలంక** : తొలి సోమవారం కావటంతో నాగాయలంకలోని గంగా పార్వతీ సమేత శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్ భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామునుంచే భక్తులు ఘాట్‌లో పుణ్యస్నానాలు చేసేందుకు తరలివచ్చారు. దీపారాధనలు చేశారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం 108 కిలోల విభూదితో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. **చల్లపల్లి** : కార్తీకమాసం మొదటి సోమవారం నడకుదురులోని మహిమాన్విత శైవక్షేత్రం పృథ్వీశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివెళ్లి స్వామి వారికి అభిషేకాలు చేయించుకుని దీపారాధనలు చేశారు. చల్లపల్లిలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు బారులుతీరారు. లక్ష్మీపురంలోని దుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు జరిపారు.



ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

మెరుగైన వైద్యసేవలందించాలి

● బీసీ సంఘం నేత సుబ్రహ్మణ్యం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలతను జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేగు సుబ్రహ్మణ్యం కోరారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భానుమూర్తి, ఆర్‌ఎంవో నిరంజన్‌లను శేగు సుబ్రహ్మణ్యం కలిసి సత్కరించి ఆసుపత్రిలోని సమస్యలపై చర్చించారు. ఎంఆర్ఐ స్కానింగ్ విభాగంలో ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. ఒక్కో రోగికి ఒక్కో విధంగా చలానాలు కట్టిస్తున్నారన్నారు. రక్త సేకరణ సమయంలో టోర్నికిట్‌లు అందజేయాలన్నారు. వైరల్ ఫీవర్లు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. జన్ను గోవిందు, బి సుభాని, నిక్కు రాధాకృష్ణ, ధనికొండ చిన్ని, ఎం రామరాజు, ఎం గోపి రత్తయ్య పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మంచి దిగుబడులు

మోపిదేవి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వరి, మినుము పంటలలో విత్తనశుద్ధి చేస్తే తెగుళ్ల ఆశించకుండా రైతులు మేలైన దిగుబడులు సాధించే అవకాశం ఉందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. పెదప్రోలులో పంటల సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. వరి, అపరాలు వంటి పంటలు వేసే ముందు రైతుల నుంచి ఎంచుకున్న విత్తనాలను సేకరించి, విత్తనశుద్ధి చేసే తెగుళ్ల, పురుగులు ఆశించకుండా పంటను కాపాడుకోగలమన్నారు. ప్రస్తుతం మండలంలో వరిపంట చిరుపొట్ట దశలో ఉందని, వర్షానికి పంట దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న నీటిని బయటకు మళ్లించే ప్రయత్నం చేయాలన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నాదెండ్ల శరత్ చంద్రబాబు, ఆదర్శ రైతు చంద్ర రామకృష్ణ, వీఏఏ విజయ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బాలకృష్ణ అభిమాన సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మృతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర బాలకృష్ణ అభిమాన సంఘం మాజీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు (60) సోమవారం బుట్టాయిపేటలోని స్వగృహంలో మృతి చెందారు. ఇటీవల శ్రీనివాసరావు అనారోగ్యానికి గురయ్యారు. శ్రీను మృతికి బాలకృష్ణ అభిమాన సంఘం ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



వరికోత యంత్రాన్ని అందజేస్తున్న సీఐ ఈశ్వరరావు

వరికోత యంత్రాలకు ఆదరణ

చల్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతికూల పరిస్థితుల్లో వరి పంటను కాపాడుకునేందుకు, కూలీల సమస్యను అధిగమించేందుకు వరికోత యంత్రాలు ఎంతో దోహదం చేస్తున్నాయని చల్లపల్లి సీఐ కె. ఈశ్వరరావు అన్నారు. చల్లపల్లి మండలంలో వరికోత యంత్రాల ఆథరైజ్డ్ డీలర్ దినేష్ మేకా సోమవారం వరికోత యంత్రాన్ని నెల్లూరు జిల్లాకు చెందిన కటారి మునికి విక్రయించారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు చేతులమీదుగా యంత్రం తాళాలను యజమానికి అందజేశారు.

చేనేత కార్మికుడికి ఆర్థిక సాయం

పెడన, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నున్న శివరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం ఆరు వేల రూ పాయల ఆర్థిక సాయం అందించారు. సంస్థ పెడన శాఖ ప్రతినిధులు మట్టా రాధాకృష్ణమూర్తి, అనుముకొండ గౌరీ ప్రసాద్, పేరిశెట్టి నాగరవి, ఊటుకూరి సుబ్బారావు, ఖుర్షిద్ బేగం తదితరులు పాల్గొన్నారు.



గోల్డెన్ స్టార్ ఫొటోగ్రఫీ అవార్డు అందుకుంటున్న చిలంకుర్తి శేషు

చిలంకుర్తి శేషుకు గోల్డెన్ స్టార్ ఫొటోగ్రఫీ అవార్డు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఫొటోగ్రఫీ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న చిలంకుర్తి శేషుకు స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సత్యసాయినిగమ్‌లో సోమవారం బెస్ట్ గోల్డెన్ స్టార్ ఫొటోగ్రఫీ అవార్డును అందజేశారు. స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ వ్యవస్థాపకుడు కె.వై. గిరిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ ఫొటోగ్రాఫర్ పోతన ఓంప్రకాష్‌కు కూడా బంగారు నంది అవార్డును అందజేశారు. శేషును మచిలీపట్నం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.